ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

శుక్రవారం, మార్చి 6, 2026 | సంపుటి - 22 | సంచిక 159 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## తెలుగు రాష్ట్రాల్లో టెన్త్ పరీక్షలకు రెడీ

- తెలంగాణలో 14 నుంచి, ఎపిలో 16 నుంచి పరీక్షలు
- వాట్సాప్ ద్వారా హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్‌కు అవకాశం

2 వివరాలు

*తెలుగు రాష్ట్రాల్లో పదో తరగతి పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు విడుదలయ్యాయి. తెలంగాణలో మార్చి 14 నుంచి.. ఏపీలో 16 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఈ పరీక్షలకు ఇంకా కొన్ని రోజులు మాత్రమే గడువు ఉంది.*





## ముగిసిన రాజ్యసభ నామినేషన్లు

### కాంగ్రెస్ అభ్యర్థులుగా సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి

- చివరి రోజు కావడంతో ఇద్దరూ నామినేషన్ల దాఖలు
- సిఎం రేవంత్, మంత్రులు, ఎమ్మెల్యేల రాకతో కోలాహలం

2

**హైదరాబాద్,మార్చి5(నినాదం):** రాజ్యసభ ఎన్నికల నామినేషన్ పక్రియ గురువారం ముగిసింది. తెలంగాణ నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున రాజ్యసభ అభ్యర్థులుగా అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల అధికారి ఉపేందర్‌రెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ తో పాలు పలువురు మంత్రులు హాజరయ్యారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పెద్ద ఎత్తున అసెంబ్లీ ప్రాంగణానికి చేరుకున్నారు. తెలంగాణ తరఫున రాజ్యసభకు రెండోసారి వెళ్లడం అదృష్టంగా భావిస్తున్నట్లు అభిషేక్ సింఘ్వీ తెలిపారు.



## ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ

- దిగుమతుల సుంకాలను తిరిగి చెల్లించాల్సిందే
- అమెరికన్ ట్రేడ్ కోర్టు తీర్పు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. దిగుమతులపై విధించిన సుంకాలను తిరిగి చెల్లించాల్సిందేనని ట్రేడ్ కోర్టు తీర్పు ఇచ్చింది. ఇటీవల 1977 అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం కింద ట్రంప్ విధించిన భారీ టారిఫ్‌లను సుప్రీం కోర్టు రద్దు చేసింది.

2

# తగ్గేదేలే..



## మిస్సైళ్లు, డ్రోన్‌లతో విరుచుకుపడుతున్న ఇరాన్

### చైనా సహకారంతోనే అంటూ.. అంతర్జాతీయ కథనాలు

## ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికాలకు సంయుక్త దాడులు

## అమెరికా మరో దుస్సాహసం

### అణు వార్‌హెడ్ క్షిపణి పరీక్ష



**వాషింగ్టన్,మార్చి5(నినాదం):** పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నడుమ అమెరికా భారీ అణు సామర్థ్యం గల క్షిపణి పరీక్ష నిర్వహించడం ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. అమెరికా సైన్యం కాలిఫోర్నియా తీరంలో ఉన్న వాండెన్‌బర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్ నుంచి శక్తిమంతమైన మినిట్‌మ్యాన్ 3 ను విజయవంతంగా ప్రయోగించింది. ఈ పరీక్షను అమెరికా సాధారణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిందని అధికారులు వెల్లడించారు.

2



ఇరాన్ దాడిలో కాలిపోతున్న అమెరికా ట్యాంకర్

**టెహ్రాన్,మార్చి5(నినాదం):** ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడుల నేపథ్యంలో ఇరాన్ ఇటీవల దీటుగా బదులిస్తోంది. దాడుల్లో ఎక్కడా తగ్గడం లేదు. తమ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీ మృతి అనంతరం మధ్య ప్రాచ్య దేశాలపై ఇరాన్ భీకర దాడులు చేపట్టింది. భారీ ఆయుధాలతో విరుచుకుపడుతూ పశ్చిమాసియా దేశాలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఓవైపు ఇరాన్ వద్ద ఆయుధ నిల్వలు తగ్గిపోతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. మరోవైపు.. ఇజ్రాయెల్, అమెరికా ఆస్తులే కాకుండా యూఏఈ, ఒమన్, బహ్రెయిన్, సౌదీ అరేబియా వంటి 10 దేశాలపై ఇరాన్ ఏకధాటిగా దాడిచేస్తున్న విధానాన్ని చూస్తే ఆ దేశం వద్ద భారీ క్షిపణులు, డ్రోన్లు ఉన్నాయనే సందేహం తలెత్తకమానదు. అయితే.. దశాబ్దాలుగా ఆ దేశం ఎంతో కృషిచేసి ఇంత భారీఎత్తున ఆయుధ సామగ్రిని నిర్మించుకుంది. మరి ఆ దేశం ఆయుధగారాన్ని పెంచుకోవడంలో చైనా హస్తం ఉందని అంతర్జాతీయ మీడియా కథనాల ద్వారా స్పష్టమవుతోంది. ఆ మీడియా నివేదికల ప్రకారం.. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ముందే ఇరాన్‌కు చైనా ఆయుధాలను సరఫరా చేసినట్లు తెలుస్తోంది. వీటిలో ఆయుధాల్లో షాహిద్ క్లాస్ కామికేజ్ డ్రోన్ల నుంచి ఫత్తాహ్ క్లాస్ హైపర్‌సోనిక్ మిసైల్స్ వరకు ఇరాన్ భద్రతా వ్యూహంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి.

## ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌కు మోడీ ఫోన్

### యుద్ధంపై దౌత్యానికి పిలుపు

2

## అమెరికా కోసం భారత నావికాదళం

### అమెరికా మాజీ ఆర్మీ కల్నల్ డగ్లస్ మాక్‌గ్రెగర్ వార్తలను తిప్పికొట్టిన భారత ప్రభుత్వం



## తెలంగాణలో వాతావరణ మార్పులు

### మార్చి చివరలో పిడుగులతో కూడిన వర్షాలు

*తెలంగాణలో మార్చి నెల చివరలో అకాల వర్షా లు కురిసే అవకాశాలు ఉన్నాయని వెదర్ మ్యాన్ వెల్లడించారు.*

2



## నేటి నుంచి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక

'ప్రజాపాలన 'ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈనెల 6 నుంచి 15 వరకు పది రోజులపాటు అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించనున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ తెలిపింది.



## మంగపేటలో అత్యధికంగా 39 డిగ్రీలు..

**హైదరాబాద్, నినాదం:** తెలంగాణలో భానుడు భగభగమంటున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. గురువారం ములుగు జిల్లా మంగపేటలో అత్యధికంగా 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్, జగిత్యాల, ఖమ్మంలో 38.9 డిగ్రీలు, మంచిర్యాలలో 38.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

2

## మూసీ పేరుతో కాంగ్రెస్ దోపిడీ

### మురుగు శుద్ధి కేంద్రాలపై అశ్రద్ధ : కాంగ్రెస్‌ది విధ్వంస పాలన

### నాగోల్ సమీపంలో మూసీని పరిశీలించిన కెటిఆర్ బృందం

**మూసీ పేరుతో దోచుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం కుటిల ప్రయత్నాలు చేస్తున్నదని సీఎం రేవంత్ రెడ్డిపై బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. బీఆరఎస్ పాలనలో వికాసం, కాంగ్రెస్ పాలనలో విధ్వంసం కొనసాగుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క ఇటుకను పేర్చనోడికి కూల్చే హక్కులేదని మండిపడ్డారు.**

2

**హైదరాబాద్, నినాదం:** నాగోల్ మూసీ పరీవాహక ప్రాంతంలో బీఆరఎస్ ప్రభుత్వం చేసిన సుందరీకరణ పనులను గురువారం బీఆరఎస్ నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాడు మూసీలోని మురుగు నీరుని శుద్ధి చేయాలని బీఆరఎస్ ముందుకెళ్లింది. దేశంలోనే అతిపెద్దది అయిన నాగోల్ ఎస్టీపీని రూ. 4వేలకోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాం. బీఆరఎస్ ప్రభుత్వంలో ఇండ్లు కూల్చకుండా, భూములు కోల్పోకుండా మూసీని అభివృద్ధి చేశామన్నారు. 2023 డిసెంబర్ వరకు 85 శాతం ఎస్టీపీ నిర్మాణం పూర్తయింది. 15 బ్రిడ్జీలు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసింది.



## వణుకు పుట్టిస్తున్న ఎస్టీ అస్త్రం




- ఖమ్మం అధికారుల మెడపై జాతీయ కమిషన్ కత్తి!
- వారం రోజుల్లో రిపోర్ట్ ఇవ్వకపోతే ఢిల్లీకి ఈడ్చుకెళ్తాం
- హుస్సేన్ నాయక్ వార్నింగ్
- రెవెన్యూ యంత్రాంగంపై జాతీయ ఎస్టీ కమిషన్ గరం..
- కమిషన్ వస్తే ముఖం చాటేస్తారా?
- సస్పెన్షన్లు ఖాయం.. అట్రాసిటీ కేసులు తథ్యం!
- బిక్కుబిక్కుమంటున్న అధికార యంత్రాంగం

5 వివరాలు




## హైదరాబాద్‌లో మరో రియల్ మోసం

### ప్లాట్ల పేరుతో జనానికి కుచ్చుటోపీ

**హైదరాబాద్, నినాదం:** హైదరాబాద్ లో మరో రియల్ ఎస్టేట్ మోసం వెలుగులోకి వచ్చింది. అపార్ట్‌మెంట్ల నిర్మాణం పేరుతో వందల కోట్ల రూపాయలకు కుచ్చుటోపీ పెట్టింది త్రిపురా కన్స్ట్రక్షన్స్. దీంతో పోలీసులు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పసుపులేటి సుధాకర్ అతని భార్యను అరెస్ట్ చేశారు .

2

## నిర్మాణ భవనం వద్ద ప్రమాదం

### కర్రలు కూలి కిందపడ్డ ముగ్గురు మృతి

హైదరాబాద్ నగరంలోని టోలిచౌకిలో ఘోర ప్రమాదం జరిగింది. అల్ హస్నాత్ కాలనీలో భవన నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన గోవా కర్రలు కూలిపోవడంతో పై నుంచి కిందపడి ముగ్గురు కార్మికులు మృతి చెందారు.

## దేశంలో తగ్గుతున్న ఫెర్టిలిటీ రేటు

2

- రాష్ట్రంలో ఏటా 6.70 లక్షల జననాలు నమోదు
- 2047 నాటికి జనాభాలో 23 శాతం మంది వృద్ధులు
- ఫెర్టిలిటీ సమస్యలతో బాధపడే వారికి ప్రభుత్వం ప్రోత్సాహం
- కుటుంబ నియంత్రణ నుంచి జనాభా పెరుగదల లక్ష్యం
- పాపులేషన్ పాలసీపై చర్చ జరగాలి
- అసెంబ్లీలో డ్రాఫ్ట్ ప్రవేశ పెట్టిన సిఎం చంద్రబాబు

*జపాన్, దక్షిణ కొరియా, ఇటలీ లాంటి దేశాల్లో ఫెర్టిలిటీ రేట్ తగ్గుతోందని.. భారత్‌తో పాటు ఏపీ లాంటి రాష్ట్రాల్లోనూ ఈ తరహా పరిస్థితే నెలకొందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో టోటల్ ఫెర్టిలిటీ రేట్ 1.5గా ఉందని.. 1993లో ఇది 3.0గా నమోదైందని సీఎం వివరించారు.*



**అమరావతి,మార్చి5(నినాదం):** టీఎఫ్ఆర్ వేగంగా తగ్గితే పని చేసే వయస్సులో ఉన్నవారి సంఖ్య గణనీయంగా తగ్గి, ఆర్థిక వృద్ధి మందగిస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే ఆర్థిక వ్యవస్థకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని చెప్పారు. ఏపీ శాసనసభలో పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. ఏపీకి అత్యంత కీలకమైన పాలసీని శాసనసభలో ప్రకటించారు. ఇప్పటి వరకు ఫ్యామిలీ ప్లానింగ్‌కు ప్రాధాన్యం ఇచ్చామని.. ఇకపై పాపులేషన్ కేర్ వైపు



## కాళేశ్వరం కమిషన్ ఏర్పాటులో దురుద్దేశం లేదు

- హైకోర్టుకు వివరించిన తెలంగాణ ప్రభుత్వం
- అవకతవకలు, డబ్బు దుర్వినియోగంపైనే దృష్టి
- తదుపరి విచారణ 12కు వాయిదా వేసిన కోర్టు

2



# ప్రజలను మంచే.. మూసీ అభివృద్ధి తగదు !

అభివృద్ధి పేరిట అరాచకాలు, దాని వెనక సంపాదన లక్ష్యాలు..తప్ప ప్రజల పక్షాన ఆలోచించే ప్రభుత్వాలు కానరావడం లేదు. ప్రజలకు ఏం చేస్తే బాగుపడతారన్న ఆలోచనలు చేయడం లేదు., తాయిలాలతో ఓట్లు దండుకుని పాలన చేసే రోజులు పోవాలి. స్వాతంత్ర్యం లభించి 79 ఏళ్లు పూర్తి కావస్తున్న వేళ .. ఇంకా పేదరికం తాండవించ దానికి పాలకుల దూదరద□ష్టి, చిత్తశుద్ధి లోపమే ప్రధాన కారణం. ప్రజల నుంచి పన్నుల రూపంలో వస్తున్న డబ్బును సమర్థంగా నిర్వహించడం లేదు. నేటికీ కిలో రూపాయి బియ్యం అందించడం ప్రజలను అవమాన పర్చడమే. పేదరికం పేరుతో నాలుగు రాళ్లు విదిలించి తమ పబ్బం గడుపుకోవడం, దాని వెనక ఉన్న అధికారదాహం గుర్తించాలి. పథకం ఏదైనా ప్రజలను మభ్య పెట్టడం ఒకటయితే..అధికారం అంటిపెట్టు కోవడం దాని లక్ష్యంగా మారింది. అన్నింటికి మించి తెలంగాణ రావాలని, కావాలని కొట్లాడిన ప్రజలంతా దగాపడ్డారు. మోసపోయారు. కానీ తెలంగాణ పేరుతో తీపికబుర్లు చెప్పిన వారంతా అందలం ఎక్కారు. కెసిఆర్ కుటుంబం ఇందులో ముందున్నది. లక్షల కోట్ల అప్పు మన నెత్తిన పెట్టి, అధికారం పోయినా తామే అభివ□ద్ధి చేశామని నంగనాచి కబుర్లు చెబుతోంది. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ వంటి ప్రాజెక్టుల పేరుతో ఊర్లు ఖాళీ చేయించారు. భూములు గుంజుకున్నారు. వారిని రోడ్డు పడేశారు. ఊళ్లకు ఊళ్లు మాయమయ్యాయి. ఆ ప్రాజెక్టుల్లో మా ఊరు ఉందని చూసుకుని మురిసేలా ..వారి జీవితాలను మాత్రం బాగు చేయాలేదు. ఏనాడు కూడా ఆ ప్రజల గురించి కెసిఆర్ ఆలోచించలేదు. ఫార్మాసిటీ పేరుతో కూడా అలాగే భూములను లాగేసుకున్నారు. ఇక కెసిఆర్‌ను తిట్టి, ఆయన తెలంగాణను అడ్డంగా దోచుకున్నాడని చెప్పి, ప్రజల మద్దతు పొంది అధికారం చేపట్టిన రేవంత్ రెడ్డి చేస్తున్నదేమిటి? ఆయన కూడా అదే దారిలో పాలన సాగిస్తున్నాడు. అన్నీ మంచే చేస్తున్నానని చెప్పే ప్రచార క్రమంలో ప్రజలను విస్మరిస్తున్నారు. ప్రజలను విస్మరించి, వారిని గోసపెట్టి చేపట్టే పనులతో ఏం బావరుకుందామని అనుకుంటున్నారో చెప్పాలి. హైదరాబాద్‌ను అభివ□ద్ధి చేయడంలో కానీ, మూసీ నుంచి మురికిని తరిమి వేయడంలో కానీ ప్రజలకు అభ్యంతరం ఉండదు. ఎక్కడో సర్దార్ సరోవర్ ప్రాజెక్టులో అత్యంత ఎత్తయిన పటేల్ విగ్రహాన్ని కట్టారని, హైదరాబాద్‌లో అంతకు మించి గాంధీ విగ్రహం కట్టడం లక్ష్యంగా చేస్తున్న ప్రయత్నంలో ఆంతర్యం బోధపడనిది కాదు. మూసీ అభివ□ద్ధి వరకు బాగానే ఉంది. కానీ భారీ విగ్రహాలతో సాధించేదేముంది. గాంధీకి భారీ విగ్రహం లేకుంటే ఆ మహాత్ముడికి వచ్చే నష్టం ఏవి□ లేదు. కానీ ఈ విగ్రహం పేరుతో, మూసీ ప్రక్షాళన పేరుతో వేలాదిమంది ప్రజలను నిరాశ్రయులను చేయాలన్న కుటిల యత్నాలను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిందే. మూసీ పరివాహక ప్రాంతంలో తరలించా లనుకుంటున్న ప్రజలకు ముందుగా ఎక్కడ ఇళ్లు నిర్మిస్తారో చెప్పండి. ఉన్న భూములను వేలం వేస్తూ పోతున్న రేవంత్ ప్రభుత్వం ఈ పేదలకు ఎక్కడ భూములు ఇస్తుందో ముందు చెప్పాలి. హైదరాబాద్ నగర అభివ□ద్ధిలో భాగంగా పేరుతో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపడుతున్న మూసీ నది అభివ□ద్ధి ప్రణాళిక కారణంగా ఎన్నివేల కుటుంటంబాలు రోడ్డున పడతాయో చెప్పాలి. ఖమ్మం జిల్లాలో రాత్రికి రాత్రి భూదాన్ భూముల పేరుతో ప్రజలను రోడ్డున పడేశారు. ఉన్న జాగాల్లోనే వారిని ఎందుకు ఉండనీయడం లేదు. కొత్తగా ఇందిరమ్మ ఇళ్లను కట్టిస్తామని చెప్పడం దగా చేయడం తప్ప మరోటి కాదు. ఉన్న భూములను అమ్ముకోవడం, ఉన్నావారిని ఖాళీ చేయించడం ద్వారా తెలంగాణ ప్రజలను రాచి రంపాన పెడుతున్న ఈ ప్రభుత్వ చర్యలను ప్రజలు నిలదీయాల్సిందే. నగరంలో మూసీ ప్రక్షాళన పేరుతో గాంధీ సరోవర్ ప్రాజెక్టు ప్రత్యేక ఆకర్షణగా ప్రచారం చేస్తున్నారు. మూసీ నదిని శుద్ధి చేసి, రివర్ ఫ్రంట్‌గా తీర్చిదిద్ది, పర్యాటక కేంద్రంగా అభివ□ద్ధి చేయాలన్న ప్రభుత్వం సంకల్పం మంచిదే అయితే ప్రజలు కూడా స్వాగతిస్తారు. కానీ అభివ□ద్ధి పేరుతో వారి గూడును చెదరగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. నిజంగానే వారిని ఈ ప్రాజెక్టులో భాగస్వామ్యం చేస్తే ప్రణాళిక గొప్పగా ముందుకు సాగుతుంది. మూసీ అభివ□ద్ధి మంచి సంకల్పమే అయితే ఖాళీ చేయించే వారికి భూమికి భూమి, ఇల్లుకు ఇల్లు, ఫ్లాట్‌కు ఫ్లాట్ ఎక్కడ ఇస్తారో ముందుగా ప్రకటించాలి. అక్కడ కాలనీలు అన్ని వసతులతో నిర్మించాలి. వి□రు ఇవ్వాలను కుంటున్న పిచ్చుక గూడు ఇందిరమ్మ ఇళ్లతో ప్రజలను మభ్య పెట్టరాదు. మూసీ నదిని శుద్ధి చేయాల్సిందే. ఈకంపును దూరం చేయాల్సిందే. పర్యావరణ పునరుద్ధరణ జరగల్సిందే. వరద నియంత్రణ చేయల్సిందే. పర్యాటకాభివ□ద్ధి కూడా రావాల్సిందే. ఇవన్నీ నగర ప్రజలు కోరుకుంటున్నవే. వి□రు చేస్తానంటే వద్దని అనడం లేదు. కానీ ప్రజలను ఏమార్చి వారిని తరిమి కొట్టి ఇదంతా చేయడం ద్వారా వచ్చే ప్రయోజనాలను పొందాలన్న యత్నం మాత్రం సరికాదు. గత కొన్ని దశాబ్దాలుగా మూసీ కాలుష్యానికి గురైందన్నది కళ్లకు కనిపిస్తున్న నిజం. ప్రభుత్వం ప్రకటిస్తున్న మూసీ రివర్ ఫ్రంట్ అభివ□ద్ధి కేవలం కార్పోరేట్ ప్రయోజనాలకే అన్న అపోహ ఉంది. అయితే మూసీ వెంట ఉన్న ప్రజల నివాస హక్కులు, జీవనోపాధి, భద్రత గాలికి వదిలేసి ముందుకు సాగాలన్న నిరంకుశ విధానమే సరికాదు. దీనినే ప్రతి ఒక్కరు ప్రశ్నిస్తున్నారు. అభివ□ద్ధి పేరుతో ప్రజల గూడును, ఇంటితో వారికున్న అనుబంధాన్ని నిరంకుశంగా తొలగిస్తామంటే కుదరదు. హైదరాబాద్ నగరంలో మొత్తం 55 కిలోవి□టర్ల పరిధిలో మూసీని శుభ్రపరిచి పునరుద్ధరించాలన్న సంకల్పాన్ని అక్కడ నివసిస్తున్న ప్రజలు కూడా స్వాగతించేలా కార్యాచరణ ఉండాలి. వారిని కూడా ఈ అభివ□ద్ధిలో భాగస్వామ్యం చేయాలి. ఇక్కడ నివసిస్తున్న వారిని తరలిస్తే..మూసీ కంపు నుంచి బయట పడ్డామన్న భావన ప్రజల్లో రావాలి. అంతకన్నా మంచి ప్రాంతంలో వారికి ఇల్లు కట్టించి ఇవ్వాలి. ఆకర్షణీయమైన మూసీ ప్రాజెక్టులో ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా కాపాడే ప్రణాళిక ఉండాలి. పునరావాసం అన్నది మూసీ ప్రక్షాళనకు మించిన ప్రాజెక్టులా ఉండాలి. ఇక్కడినుంచి తరలించిన వారు నివసించే ప్రాంతం మరో ప్రత్యేక పర్యాటక ప్రాంతంగా మారాలి. ఒక నివాసాన్ని కూల్చడం సులభం. కానీ ఒక సమాజాన్ని మళ్లీ నిర్మించడం కష్టసాధ్యం. పునరావాసం అంటే కేవలం కొత్త ఇల్లు కట్టివ్వడం కాదు. అదే పరిసరాల్లో ఉపాధి అవకాశాలు, విద్య, వైద్యం, రవాణా సౌకర్యాలు కల్పించడం కూడా అంతే అవసరం. లేకపోతే ప్రజలు మానసికంగా క□ంగి క□శించి పోతారు. గతంలో జరిగిన అనుభవాల ద□ష్ట్యా మూసీ పరివాహకంలో ప్రజలను తరలించే ప్రక్రియ పారదర్శకంగా సాగాలి. వారికి ఉత్తేజాన్ని కలిగించేలా ఉండాలి. ఈ ప్రాజెక్టులో భాగమైనందుకు వారంతా ఆనందించేలా ఉండాలి. అంతేకానీ రోడ్డున పడేసే కార్యక్రమం కారాదు. అప్పుడు కెసిఆర్ పాలనకు, రేవంత్ పాలనకు తేడాలేదన్న భావన కలుగుతుంది. ఆ ఒక్కటి చాలు చితి పెట్టడానికి అని గుర్తించాలి.

సంపాదకీయం

# ఎర్ర జెండా నీడలో నలభై ఏళ్ల పోరాటం:గణపతి ప్రయాణం

### రెడ్ కారిడార్ క్షీణతలో ఒక అధ్యాయం: గణపతి లొంగుబాటు నిర్ణయం ప్రభావం

భారతదేశ రాజకీయ చరిత్రలో సాయుధ ఉద్యమం ఒక విభిన్న అధ్యాయంగా నిలిచింది. ఆ అధ్యాయానికి ప్రతీకగా మారిన పేరు ముప్పాళ లక్ష్మణ్ రావు, "గణపతి"గా ప్రసిద్ధి పొందిన వ్యక్తి. ఇటీవల వెలువడుతున్న లొంగుబాటు వార్తల నేపథ్యంలో ఆయన జీవితం, ఉద్యమ ప్రయాణం, దేశ రాజకీయ–సామాజిక పరిణామాలపై వాటి ప్రభావం మళ్లీ చర్చకు వచ్చింది. ఒక వ్యక్తి నిర్ణయం వెనుక దాగి ఉన్న దశాబ్దాల చరిత్రను, పూర్వాపరాలను, గణాంకాలను సమగ్రంగా పరిశీలించడం అవసరం.

1967లో పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్బరి గ్రామంలో రైతుల తిరుగుబాటు భారత రాజకీయ దిశను ప్రభావితం చేసింది. భూస్వామ్య వ్యతిరేక పోరాటంగా ప్రారంభమైన ఆ ఉద్యమం "నక్సల్బరి" పేరుతో దేశవ్యాప్తంగా విస్తరించింది. విద్యార్థి యువత, సామాజిక అసమానతలపై ఆవేదన కలిగిన వర్గాలు ఈ సిద్ధాంతానికి ఆకర్షితులయ్యాయి. గ్రామీణ భారతంలో భూమి పంపిణీ, కూలీల హక్కులు, గిరిజనుల జీవనాధారాల పరిరక్షణ వంటి అంశాలు ఆ ఉద్యమానికి మూల సూత్రాలుగా నిలిచాయి.

ఆ ప్రభావంలోనే ఉమ్మడి కరీంనగర్ జిల్లా, ప్రస్తుత జగిత్యాల జిల్లా లోని మండల కేంద్రం అయిన బీర్‌పూర్ గ్రామానికి చెందిన ముప్పాళ లక్ష్మణ్ రావు యువకుడిగా వామపక్ష భావజాలం వైపు మళ్లాడు. 1970లలో ఆంధ్రప్రదేశ్‌లో విస్తరించిన సాయుధ గుంపుల్లో చేరి, తరువాత పీపుల్స్ వార్ గ్రూప్ లో ప్రముఖ పాత్ర పోషించాడు. కొండపల్లి సీతారామయ్య నాయకత్వంలో ఏర్పడిన ఈ సంస్థ తెలంగాణ–ఆంధ్ర అటవీ ప్రాంతాల్లో గెరిల్లా యుద్ధ వ్యూహాలతో కార్యకలాపాలు సాగించింది. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ నిర్మాణం, గిరిజన యువతను ఆకర్షించడం, భూస్వామ్య వ్యతిరేక ప్రచారం వంటి కార్యక్రమాల్లో గణపతి సక్రియంగా పాల్గొన్నాడు. 2004లో పీపుల్స్ వార్ గ్రూప్ మరియు మావోయిస్టు కమ్యూనిస్ట్ సెంటర్ విలీనమై కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్) గా మారడం ఎడమచేయి అతివాద చరిత్రలో కీలక మలుపు. ఈ విలీనంతో దేశవ్యాప్తంగా ఉన్న విభిన్న గుంపులు ఒకే కేంద్రీయ నాయకత్వం కిందకి వచ్చాయి. ఆ సమయంలో గణపతి ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించి ఉద్యమానికి వ్యూహాత్మక దిశనిచ్చాడు. దండకారణ్య అటవీ ప్రాంతం కార్యకలాపాల కేంద్రంగా మారింది.

2004–2014 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా మావోయిస్టు కార్యకలాపాలు గణనీయంగా పెరిగాయి. అధికార గణాంకాల ప్రకారం ఈ దశాబ్దంలో సుమారు 14,800కు పైగా హింసాత్మక ఘటనలు నమోదయ్యాయి; 6,000కు పైగా ప్రాణనష్టం సంభవించింది. భద్రతా దళాలు, మావోయిస్టులు, సాధారణ పౌరులు——మూడు వర్గాలూ ఈ ఘర్షణల్లో బలయ్యారు. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో దాడులు తీవ్రరూపం దాల్చాయి. 2009లో కేంద్ర ప్రభుత్వం "ఆపరేషన్ గ్రీన్ హంట్" పేరుతో విస్తృత భద్రతా చర్యలు ప్రారంభించింది. అటవీ ప్రాంతాల్లో సైనిక శక్తిని పెంచడం, ప్రత్యేక బలగాలను నియమించడం, ఇంటెలిజెన్స్ వ్యవస్థను బలోపేతం చేయడం వంటి చర్యలు తీసుకుంది.

ఈ చర్యల ఫలితంగా 2014 తరువాత హింసాత్మక ఘటనలు క్రమంగా తగ్గుముఖం పట్టాయి. 2014–2024 మధ్యకాలంలో ఘటనలు సుమారు 7,100కు తగ్గి, మరణాల సంఖ్య 1,800కు చేరినట్లు కేంద్ర సమాచారం సూచిస్తుంది. ఒకప్పుడు 126 జిల్లాలను ప్రభావితం చేసిన ఎడమచేయి అతివాదం ప్రస్తుతం సుమారు 10–12 జిల్లాలకు మాత్రమే పరిమితమైందని అధికార నివేదికలు చెబుతున్నాయి. 2024లో సుమారు 475 మంది మావోయిస్టులు లొంగిపోగా, 2025లో ఈ సంఖ్య వెయ్యి దాటిందని భద్రతా వర్గాలు ప్రకటించాయి. ఇదే కాలంలో భద్రతా దళాల చర్యల్లో వందలాది మావోయిస్టు కాదర్లు మరణించినట్లు కూడా గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

ఈ పరిణామాల్లో గణపతి వ్యక్తిగత పరిస్థితులు కూడా కీలకమయ్యాయి. ఆరోగ్య సమస్యలు, వయోభారం కారణంగా 2018 ప్రాంతంలో ఆయన ప్రధాన కార్యదర్శి బాధ్యతల నుండి తప్పుకోవడం జరిగింది. నాయకత్వ మార్పులు, అంతర్గత విభేదాలు, సాంకేతిక నిఘా వ్యవస్థల పెరుగుదల—— ఇవి ఉద్యమ సామర్థ్యాన్ని దెబ్బతీశాయి. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, విద్యా సదుపాయాలు, మొబైల్ కనెక్టివిటీ విస్తరించడం వల్ల భూగర్భ కార్యకలాపాలు కష్టతర మయ్యాయి.

ఇటీవల వెలువడుతున్న లొంగుబాటు వార్తలు ఈ క్రమంలో ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గణపతి స్వచ్ఛందంగా లొంగుతారా? లేక ఇప్పటికే గోప్యంగా చర్చలు జరిగాయా? అన్నది స్పష్టత పొందాల్సి ఉంది. అయితే ఒక విషయం మాత్రం స్పష్టం——ఒక దశాబ్దాలపాటు అత్యంత వాంఛనీయుడిగా ప్రకటించ బడిన నాయకుడు లొంగితే, అది ఉద్యమ చరిత్రలో సంకేతాత్మక మలుపు అవుతుంది.

ఇది కేవలం ఒక వ్యక్తి మార్పు కాదు; ఒక సిద్ధాంత–సాయుధ ప్రయాణానికి సంబంధించిన చారిత్రక దశ. అయితే దీనిని పూర్తిస్థాయి ముగింపుగా చూడటం సరికాదు. ఎందుకంటే సామాజిక అసమానతలు, భూహక్కుల సమస్యలు, గిరిజనుల జీవనోపాధి సంక్షోభం వంటి మూల కారణాలు ఇంకా పూర్తిగా పరిష్కరించ బడలేదు. కేవలం భద్రతా చర్యలతో ఉద్యమం తగ్గినా, శాశ్వత పరిష్కారం కోసం సమగ్ర అభివృద్ధి విధానాలు, పారదర్శక పాలన, స్థానిక ప్రజల భాగస్వామ్యం అవసరం.

గణపతి జీవితం విరుద్ధాల సమాహారం. ఒకవైపు సిద్ధాంతవేత్తగా రచనలు చేసిన వ్యక్తి; మరోవైపు హింసాత్మక పోరాటాలకు నాయకత్వం వహించిన వ్యక్తి. ఒకవైపు గిరిజన హక్కుల పరిరక్షణ నినాదాలు; మరోవైపు నిరపరాధుల ప్రాణనష్టం. ఈ విరుద్ధాలను అర్థం చేసుకోకుండా ఆయన ఉద్యమ రీతిని పూర్తిగా అర్థం చేసుకోవడం సాధ్యం కాదు.



లొంగుబాటు జరిగితే చట్టపరమైన ప్రక్రియలు, విచారణలు, బాధితులకు న్యాయం వంటి అంశాలు ముందుకు వస్తాయి. అదే సమయంలో ఆయన అనుభవాలు ఉద్యమ అంతర్గత గమనాన్ని వెలుగులోకి తెచ్చే అవకాశమూ ఉంటుంది. చరిత్రలో అనేక సాయుధ ఉద్యమాలు కాలక్రమేణా రాజకీయ ప్రధాన ప్రవాహంలో కలిసి పోయాయి. కొన్ని క్షీణించాయి. గణపతి పరిణామం కూడా ఆ దిశగా ఒక సూచన కావచ్చు.

మొత్తంగా చూస్తే, ముప్పాళ లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి ప్రయాణం భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఒక సవాలు, ఒక పాఠం. సాయుధ మార్గం, ప్రజాస్వామ్య మార్గం మధ్య ఉన్న విభేదం, అభివృద్ధి–భద్రతా సమతుల్యత, సామాజిక న్యాయం సాధన——ఇవి గణపతి ప్రయాణంలో అంతర్లీనంగా ఉన్నాయి. లొంగుబాటు సందర్భం దేశానికి ఒక ఆత్మపరిశీలన క్షణం. సమగ్ర అభివృద్ధి, న్యాయ సమ్మత పాలన, ప్రజల విశ్వాసం——ఈ మూడు స్తంభాలపై దృష్టి కేంద్రీకరించినప్పుడే ఇలాంటి ఉద్యమాల అవసరం శాశ్వతంగా తగ్గుతుంది. గణపతి ఉద్యమ జీవితం ఆ దిశగా ఒక చరిత్ర బోధ.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

## కుదుట పడ్డ స్టాక్ మార్కెట్లు

### నష్టాల నుంచి స్వల్పంగా లాబాల్లోకి

ముంబై : పశ్చిమాసియాలోని ఉద్రిక్తతల కారణంగా గత మూడు సెషన్లలో భారీ నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు గురువారం కోలుకున్నాయి. అణు ఒప్పందం విషయంలో ఇరాన్ కాస్త వెనక్కి తగ్గినట్టు ఆ దేశ విదేశాంగ మంత్రి మాట్లాడడం సూచీలపై పాజిటివ్ ప్రభావాన్ని చూపింది. అలాగే కనిష్ఠాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపడం, అంతర్జాతీయంగా కొన్ని సానుకూల సంకేతాలు సూచీలను లాభాల వైపు నడిపించాయి. అలాగే డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి కాస్తంత కోలుకుంది. అలాగే ఆయిల్, గ్యాస్ రంగ స్టాక్స్‌లో కొనుగోళ్లు కూడా కలిసొచ్చాయి. చివరకు సెన్సెక్స్, నిఫ్టీ లాభాలతో రోజును ముగించాయి .గత సెషన్ ముగింపు (79,116)తో పోల్చుకుంటే గురువారం ఉదయం 400 పాయింట్లకు పైగా లాభంతో మొదలైన సెన్సెక్స్ రోజంతా లాభాల్లోనే కదలాడింది. మధ్యాహ్నం తర్వాత ఆ లాభాలు మరింత పెరిగాయి. ఒక దశలో దాదాపు 1200 పాయింట్లు లాభపడి 80,303 వద్ద ఇంట్రాడే గరిష్ఠానికి చేరుకుంది. చివరకు సెన్సెక్స్ 811 పాయింట్ల లాభంతో 79,927 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది.

# అదృశ్య యుద్ధాల యుగం! మారుతున్న ప్రపంచ శక్తి సమీకరణాలు?

మానవ నాగరికత పరిణామ క్రమంలో యుద్ధం తన రూపాన్ని పూర్తిగా మార్చుకుంది. ఒకప్పుడు సరిహద్దుల వద్ద సైన్యాల మధ్య జరిగే పోరాటం ఇప్పుడు అంతర్జాలం, ఆర్థికం, అంతరిక్ష రంగాలతో సహా సమాచార వ్యవస్థలకు విస్తరించింది. ప్రపంచ శాంతి పరిరక్షణ కోసం 1945లో అంతర్జాతీయ సంస్థలు ఏర్పడినా, నేటి బహుళ ధ్రువ ప్రపంచంలో శక్తి సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. గత దశాబ్దాలలో జరిగిన ఉగ్రవాద వ్యతిరేక చర్యలు, భౌగోళిక రాజకీయ పోటీలు గ్లోబల్ భధ్యతా విధానాలను సైనిక రంగం నుంచి సాంకేతిక రంగం వైపు మళ్లించాయి. ముఖ్యంగా 2010లో వెలుగులోకి వచ్చిన వినాశకర సాఫ్ట్‌వేర్ దాడులు, ఆ తర్వాత జరిగిన ఆరోగ్య, ఆర్థిక వ్యవస్థల అస్థిరత డిజిటల్ భద్రత ప్రాముఖ్యతను చాటిచెప్పాయి. ఈ నేపథ్యంలో అనేక దేశాలు తమ ఎన్నికల భద్రతను, సమాచార వ్యవస్థలను కాపాడుకోవడానికి సరికొత్త రక్షణ వ్యూహాలను రూపొందించుకుంటున్నాయి. భారతదేశం సైతం తన జాతీయ భద్రతా విధానాలను కాలానుగుణంగా మారుస్తూ డిజిటల్ ప్రపంచంలో ఎదురవుతున్న విస్తృత సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధమవుతోంది.

అంతర్జాల యుగంలో రక్షణ వ్యూహాలు

నేటి ప్రపంచం డిజిటల్ వ్యవస్థలపై పూర్తిగా ఆధారపడి ఉంది. బ్యాంకింగ్, రక్షణ, విద్యుత్ సరఫరా, సమాచార వ్యవస్థలు అన్నీ అంతర్జాలంతో ముడిపడి ఉండటం వల్ల సైబర్ దాడులు దేశ భద్రతకు అతిపెద్ద ముప్పుగా పరిణమించాయి. కేవలం ఒక సాఫ్ట్‌వేర్ వైరస్ ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను కూల్చివేయడం లేదా క్షిపణి వ్యవస్థలను అస్థిరపరచడం ఇప్పుడు సాధ్యమవుతోంది. దీనిని నిరోధించడానికి 'హైబ్రిడ్ వార్‌ఫేర్' అనే కొత్త రక్షణ వ్యూహం పుట్టుకొచ్చింది. అనేక దేశాలు తమ రక్షణ బలగాల్లో ప్రత్యేక సైబర్ విభాగాలను ఏర్పాటు చేస్తున్నాయి. అయితే, అత్యంత సున్నితమైన సమాచారాన్ని హ్యాకింగ్ నుంచి కాపాడుకోవడానికి కొన్ని దేశాలు తిరిగి పాత పద్ధతులకు మళ్లుతున్నాయి. ముఖ్యమైన సమాచారాన్ని భౌతిక రూపంలో భద్రపరచడం, ఇంటర్నెట్ అనుసంధానం లేని కంప్యూటర్ సర్వర్లను వాడటం వంటివి ఇందులో భాగం. ఇది సాంకేతిక వెనకబాటుతనం కాదు, డిజిటల్ యుద్ధంలో ఆత్మరక్షణకు ఒక వ్యూహాత్మక అడుగు. డేటా సార్వభౌమాధికారం అనేది ఇప్పుడు భౌగోళిక సరిహద్దుల కంటే బలమైన రక్షణ గోడగా మారింది.

ఆర్థిక శక్తి – వ్యూహాత్మక యుద్ధతంత్రం

అంతర్జాతీయ పరిశోధన సంస్థల గణాంకాల ప్రకారం గత దశాబ్దంలో ప్రపంచ రక్షణ వ్యయాలు ఊహించని రీతిలో పెరిగి, 2023 నాటికి సుమారు రెండున్నర ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు చేరుకున్నాయి. అమెరికా, చైనా, రష్యా, భారతదేశం వంటి దేశాలు అత్యధికంగా ఖర్చు చేస్తూ ఆయుధ పరిశ్రమలను తమ ఆర్థిక వ్యవస్థల్లో కీలక భాగాలుగా మార్చుకున్నాయి. ముఖ్యంగా ఉక్రెయిన్ సంక్షోభం తర్వాత ఐరోపా దేశాలు తమ రక్షణ బడ్జెట్‌లను భారీగా పెంచడం ప్రపంచవ్యాప్త మార్పులకు సంకేతంగా నిలిచింది. యుద్ధం ఒక వ్యాపారంగా మారుతోందన్న ఆందోళన ఉన్నప్పటికీ, ఆర్థిక శక్తిని ఆయుధంగా మలచుకోవడం ప్రస్తుత యుద్ధతంత్రంలో ఒక అనివార్యమైన అంతర్భాగమైపోయింది. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ బ్యాంకింగ్ వ్యవస్థలు, చెల్లింపు మార్గాలు గ్లోబల్ ఫైనాన్స్ ఆధిపత్య పోరాటంలో కొత్త మలుపులు తిప్పుతున్నాయి. దేశాల మధ్య ఆర్థిక వ్యూహాలు భవిష్యత్తులో అంతర్జాతీయ సంబంధాలను, శాంతిని శాసించే ప్రధాన శక్తులుగా మారనున్నాయి.

శాస్త్ర విజ్ఞానం – నైతిక సవాళ్లు

జీవ వైజ్ఞానిక పరిశోధనల భద్రత కోసం 1972లో కుదిరిన జీవాయుధాల నిషేధ ఒప్పందం, 1993లో అమల్లోకి వచ్చిన రసాయన ఆయుధాల నియంత్రణ చట్టం శాస్త్ర విజ్ఞానాన్ని విధ్వంసం నుండి కాపాడే కీలక ప్రయత్నాలు. జన్యు శాస్త్రం, నరాల వ్యవస్థా పరిశోధనలలో జరుగుతున్న పురోగతి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు దోహదం చేస్తున్నప్పటికీ, వీటిని విధ్వంసకర కార్యకలాపాలకు వాడే ప్రమాదంపై అంతర్జాతీయంగా ఆందోళన పెరుగుతోంది. విజ్ఞానం మానవ కళ్యాణానికి కాకుండా వినాశనానికి దారితీస్తే అది నాగరికత ఉనికికే ముప్పుగా మారుతుంది. అందుకే గ్లోబల్ స్థాయిలో రక్షణ వ్యూహాలతో జతగా నైతిక నిబంధనలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. శాస్త్రవేత్తలు, పాలకులు సమన్వయంతో పనిచేసినప్పుడే విజ్ఞాన ఫలాలు సురక్షితంగా అందుతాయి.

అంతరిక్ష వేట – వనరుల ఆధిపత్యం

అంతరిక్షం ఇప్పుడు కేవలం శాస్త్రీయ అన్వేషణలకే పరిమితం కాకుండా అత్యంత వ్యూహాత్మక ప్రాముఖ్యత కలిగిన యుద్ధ క్షేత్రంగా అవతరించింది. 1967 నాటి అంతర్జాతీయ అంతరిక్ష ఒప్పందం ఈ రంగాన్ని శాంతి ప్రయోజనాలకే వినియోగించాలని నిర్దేశించినప్పటికీ, ఉపగ్రహాల భద్రత, రక్షణ కోసం దేశాల మధ్య పోటీ తీవ్రమవుతోంది. అమెరికా ప్రత్యేక అంతరిక్ష దళాన్ని ఏర్పాటు చేయగా, చైనా, రష్యా, భారతదేశం వంటి దేశాలు ఉపగ్రహ విధ్వంసక సాంకేతికతలో గణనీయమైన పురోగతిని సాధించి తమ సత్తా చాటాయి.

సహజ వనరులు – శక్తి రాజకీయాలు

పునరుత్పాదక శక్తి వైపు జరుగుతున్న మార్పుల నేపథ్యంలో లిథియం, కోబాల్ట్ వంటి కీలక ఖనిజాలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. చిలీ, ఆస్ట్రేలియా అలాగే డెమోక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో వంటి దేశాలు ఖనిజాల ఉత్పత్తిలో ప్రధాన కేంద్రాలుగా మారుతూ అంతర్జాతీయ శక్తి రాజకీయాలను ప్రభావితం చేస్తున్నాయి. 2015లో కుదిరిన పారిస్ పర్యావరణ ఒప్పందం వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో ప్రపంచ దేశాల మధ్య సహకారాన్ని బలోపేతం చేసినప్పటికీ, ఖనిజాల కోసం సాగుతున్న పోటీ వ్యూహాత్మక చర్చలకు కేంద్ర బిందువుగా మారింది. వనరుల ఆధిపత్యం కోసం జరుగుతున్న పోరాటం భవిష్యత్తులో కొత్త తరహా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలకు దారితీయవచ్చు.

యువత భవిష్యత్తు – విద్యా మార్పులు

నిరంతర అంతర్జాతీయ ఘర్షణలు మరియు అభద్రతా భావం రేపటి పౌరులైన యువత మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. యుద్ధం కేవలం సరిహద్దులకు పరిమితం కాకుండా, ప్రతి స్మార్ట్‌ఫోన్ ద్వారా తప్పుడు సమాచారం రూపంలో గదుల్లోకి ప్రవేశిస్తోంది. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి విద్యా వ్యవస్థల్లో విప్లవాత్మక మార్పులు అవసరం.

సమతుల్య దౌత్యం – భవిష్యత్తు దిశ

మారుతున్న ప్రపంచ పరిణామాలు యుద్ధాన్ని ఒక బహుముఖ ప్రక్రియగా మార్చివేశాయి, సైనిక శక్తితో పాటు ఆర్థిక, సాంకేతిక, పర్యావరణ అంశాలు సమాన ప్రాధాన్యతను పొందుతున్నాయి. అంతర్జాతీయ చట్టాల పట్ల గౌరవం, సమతుల్యమైన దౌత్య నీతి, పరస్పర సహకారం మాత్రమే మానవాళికి దీర్ఘకాలిక శాంతిని అందించగలవు. వివిధ దేశాల మధ్య శక్తి పోటీలు నిరంతరం కొనసాగుతున్నప్పటికీ, చట్టబద్ధమైన ఒప్పందాలు, బహుళపాక్షిక వేదికలు మాత్రమే అంతర్జాతీయ స్థిరత్వానికి గట్టి పునాదులుగా నిలుస్తాయి. భవిష్యత్తులో ఎదురయ్యే సంక్లిష్ట సవాళ్లను అధిగమించాలంటే కేవలం ఆధిపత్యం కోసం కాకుండా, ఉమ్మడి ప్రయోజనాల కోసం దేశాలు ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉంది. శాంతి అనేది ఒక బాధ్యతగా మారినప్పుడే రేపటి ప్రపంచం సురక్షితంగా ఉంటుంది. మనం తీసుకునే వివేకవంతమైన నిర్ణయాలే రాబోయే తరాలకు యుద్ధ రహిత సమాజాన్ని బహుమతిగా ఇవ్వగలవు.

**ఫిరోజ్ ఖాన్,**
**సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9640466464**



# పని చేసే ప్రదేశం లో భద్రత అవసరం

ఆధునిక కాలంలో మన జీవన విధానంలో చాలా మార్పులు వచ్చాయి.మానవ జీవితంలో వేగం పెరిగింది.నలుగురు కలిసి మాట్లాడుకునే పరిస్థితి లేకుండా పోయింది.ఇదే క్రమంలో వ్యక్తిగత భద్రత తగ్గుతుంది.పనిచేసే ప్రదేశంలో భద్రతను పెంపొందించడానికి ప్రతిఏటా మార్చి4 న జాతీయ భద్రతా దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఇందులో భాగంగా "నేషనల్ ఆక్యుపేషనల్ సేఫ్టీ అండ్ హెల్త్ క్యాంపెన్" మార్చి 4 నుండి వారంరోజులు చేపటతారు ఉద్యోగులు, సామాన్య ప్రజలు తమ జీవనవిధానంలో, వృత్తుల్లో భద్రత, ఆరోగ్య రక్షణను ఒక అంతర్గత భాగంగా మలుచుకునేలా చేయడం ఈ క్యాంపెన్ లక్ష్యం. భారత ప్రభుత్వం, శ్రామిక మంత్రిత్వ శాఖ(లేబర్ మినిస్ట్రీ) 1966 మార్చి 4వ తేదీన జాతీయ భద్రతా మండలి(నేషనల్ సేఫ్టీ కౌన్సిల్)ని స్థాపించింది. భద్రత, ఆరోగ్యం పర్యావరణాలపై అవగాహన పెంపొందించడం ఈ మండలి లక్ష్యం. సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, సెమినార్లతో పాటు సేఫ్టీ ఆడిట్లు వంటి కార్యక్రమాలను ఈ మండలి నిర్వహిస్తుంది.భద్రతా మండలి అధ్వర్యములోనే --" రహదారి భద్రతా దినోత్సవాలు , అగ్నిమాపక వారోత్సవాలు , ప్రపంచ పర్యావరణ దినోత్సవాలు " నిర్వహిస్తారు . ప్రతిరోజూ పత్రికల్లో కనిపించే వార్త రోడ్డు ప్రమాదం . మన దేశములో ప్రతియేటా దాదాపు 60 వేల మంది లక్షమంది వరకు రోడ్డు ప్రమాదాలకు గురుయైమరణించడం ,తీవ్రముగా గాయపడడం జరుగుతున్నది .ఈ రోడ్డు ప్రమాదాలలో అత్యధికం మానవ తప్పిదాలవల్ల జరుగుతున్నవే. వాహనదారులు అతివేగం గా నడపడం , రహదారుల మీద నడిచేవారు చూపే నిర్లక్ష్యం వంటివి ఈ ప్రమాదాలను సృష్టిస్తున్నాయి. వీటితో పాటుగా కర్మాగారాలలో జరిగే ఇతర ప్రమాదాలు , అగ్నిప్రమాదాలు వంటివి నిత్యం సంభవిస్తున్నాయి. పనిచేసేందుకు వెళ్ళినవారు తిరిగి క్షేమం గా ఇండికి వస్తారో ... రారో అన్నఆందోళనతో కుటుంబ సభ్యులు బతకాల్సివస్తుంది. కుటుంబ పెద్దకు ప్రమాదము జరిగినా, ప్రమాదములో మరణించినా ఇక ఆ కుటుంబము మొత్తము కోలుకోనివిధంగా దెబ్బతుంటుంది. అందుకే ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా భద్రతను పాటించాలి . ప్రతి కార్మికుడూ తాను తీసుకోవలసిన జాగ్రత్తలు తీసుకుంటే , సూచించిన పద్దతులను పాటిస్తే ప్రమాదాలు సంభవించవు .స్వాతంత్రం రాకముందు మన దేశములో పారిశ్రామికీకరణ అంతంత మాత్రమే.ఆ తరువాత పెరిగిన పరిశ్రమలతో పాటు ప్రమాదాలూ పెరగడం మొదలైనది . ప్రముఖ పారిశ్రామిక కేంద్రము ముంబైలో కార్మికుల భద్రత గురించి చర్చ 1962లో మొదలైనది .1962 లో జరిగిన రాష్ట్ర కార్మిక శాఖామంత్రుల సమావేశములో ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన ఆంశాలమీద చర్చ జరిగింది . ప్రమాదాల పట్ల అప్రమత్తత పెంచాలంటే ప్రచారము అవసరమని , అందుకు దానిని నిర్వహించడానికి , కార్మికులలో భద్రతపట్ల అవగాహన పెంచేందుకు ప్రబుత్వపరంగా ఒక సంస్థ అవసరమని గుర్తించారు . ఆ తర్వాత పారిశ్రామిక భద్రత మీద తొలి సమావేశము 1965 లో ఢిల్లీ లో నిర్వహించారు . కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు , కార్మిక సంఘాలు , ఉద్యోగ సంఘాలు , పలు సంస్థలు పాల్గొన్న ఆ సభలో జాతీయ , రాష్ట్ర స్థాయిల్లో భద్రతామండలి ప్రారంభించాలని నిర్ణయించారు. డిసెంబర్ లో ఆ సమావేశము జరుగగా .. మార్చి 04 -1966 న జాతీయ భద్రతా మండలి రూపు దిద్దుకున్నది . కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ కింద పనిచేసే ఆ మండలి ప్రారంభమయిన మార్చి 04 నే జాతీయ భద్రతా దినోత్సవంగా జరపాలని నిర్ణయించారు . ఆ రోజు నుండి వారం రోజులు పాటు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తారు . స్వతంత్ర ప్రతిపత్తి కల్గిన ఈ సంస్థ భద్రత , ఆరోగ్యము , పర్యావరణ అంశాలను దేశములోని వివిధ ప్రాంతాలకు చేరవేయడం ప్రధాన లక్ష్యం గా పెట్టుకుంది . పారిశ్రామిక రంగానికి చెందిన వారినందరినీ ఇందులో భాగస్వాములను చేయడం రెండవ లక్ష్యము . భద్రత కల్పించడంలో ప్రతి ఒక్కరూ తమవంతు పాత్రను గుర్తెరిగి అనుసరింపచేసేందుకు ఈ సంస్థ కృషిచేస్తుంది . ప్రతి పనిలోను ఏదో ఒక ప్రమాదము పొంచివుంటుంది . కొన్ని రకాల ప్రమాదాలు ముందుగా పసిగట్టలేము . కానీ ప్రమాదాలలో అధికశాతము అజాగ్రత్తవల్ల సంభవించినవే . అవి రహదారి ప్రమాదాలైనా , పారిశ్రామిక ప్రమాదాలైనా ఒకటే . నానాటి ప్రమాదాల సంఖ్య పెరుగున్నందున పారిశ్రామిక , రహదారి భద్రతల మీద దృష్టి పెంచారు . ప్రాణనష్టం అధికం గా ఉన్న ఈ రంగాలతో పాటు అగ్ని ప్రమాదాల నివారణ గురించి కూడా ప్రచారము నిర్వస్తారు . పారిశ్రామికవేత్తలు కల్పించాల్సిన భద్రతా ఏర్పాట్లు , కార్మికులు పాటించాల్సిన జాగ్రత్తలును వివరించి , వాటిని అమలుజరిగేలా ప్రచారాన్ని భద్రతా వారోత్సవ సందర్భముగా మార్చి 4 నుండి 10 వరకు నిర్వహిస్తారు వీని గూర్చి ప్రచారం చేద్దాం

**కామిడి సతీష్ రెడ్డి**
**జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా**
**9848445134**
**జాతీయ భద్రత వారోస్త్య వాల సందర్బంగా**

# అర్జున బెరడు ఆరోగ్య ప్రయోజనాలు తెలుసా..?

## చెడు కొలెస్ట్రాల్, గుండె సమస్యలపై గాండీవం..!



**నేటి ఆధునిక జీవనశైలిలో మార్పులు, ప్రజల ఆహారపు అలవాట్ల కారణంగా చాలా మంది అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇందులో అధిక కొలెస్ట్రాల్ సమస్య కూడా పెను ముప్పుగా మారింది. చెడు కొలెస్ట్రాల్ గుండె సమస్యలకు కారణం అవుతుంది. ఇది రక్త ధమనుల్లో పేరుకుపోయి, రక్త ప్రవాహాన్ని అడ్డుకుంటుంది. ధమనుల్లో పేరుకుపోయే కొవ్వును ప్లేక్ అంటారు. దీని కారణంగా గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదం పెరుగుతుంది. అందుకే చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించుకోవాలి. చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించుకోవడానికి ఆయుర్వేదంలో ఎన్నో పరిష్కారాలు ఉన్నాయి. అందులో ఒకటి అర్జున బెరడు. దీంతో కొలెస్ట్రాల్ తగ్గించుకోవడం ఎలాగో ఇక్కడ తెలుసుకుందాం..**

నిపుణుల అభిప్రాయం ప్రకారం, అర్జున బెరడులో వివిధ యాంటీఆక్సిడెంట్లు, టానిన్లు ఉంటాయి. ఈ సమ్మేళనాలు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో, రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఇది గుండెను బలోపేతం చేస్తుందని, రక్త నాళాలను శుభ్రపరుస్తుందని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే కొలెస్ట్రాల్ తగ్గుతుంది. అర్జున బెరడుతో తయారుచేసిన కషాయం లేదా నీటిని మీరు తాగొచ్చు. ఇది సిరల్లో పేరుకుపోయిన చెత్తను క్రమంగా తొలగిస్తుంది.

అర్జున బెరడు కషాయం గుండెకు చాలా ప్రయోజనకరం. ఇది గుండె కండరాలను బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. ఇంకా, మెరుగైన రక్త ప్రవాహం గుండెపై ఒత్తిడిని తగ్గిస్తుంది. అర్జున బెరడు అధిక రక్తపోటును నియంత్రించడంలో కూడా సహాయకారిగా పనిచేస్తుంది. ఇది స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. దీనిని తీసుకునే ముందు మీరు నిపుణుడిని సంప్రదించాలి. ఎందుకంటే ఇది ప్రయోజనాలు, అప్రయోజనాలు రెండింటినీ కలిగి ఉంటుంది.

**అర్జున బెరడును ఎలా ఉపయోగించాలి..**



అర్జున బెరడు పొడి ఒక టీ స్పూన్ తీసుకోవాలి. దీనికి ఒక గ్లాస్ నీరు తీసుకోవాలి. ముందుగా అర్జున బెరడు, లేద పొడిని తీసుకుని ఒక గ్లాసు నీటిలో వేసి రాత్రంతా నానబెట్టండి. ఉదయం 7 నిమిషాల పాటు సన్నని మంటమీద మరిగించాలి. ఆ తరువాత దానిని వడకట్టి ఖాళీ కడుపుతో గోరువెచ్చగా తాగండి. 6 నుండి 8 వారాల పాటు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల తేడా కనిపిస్తుంది.

**అర్జున బెరడు ప్రయోజనాలు:**
అర్జున బెరడులో ఫ్లేవనాయిడ్స్, టానిన్లు, ట్రైటెర్పెనాయిడ్స్, సపోనిన్లు వంటి ఫైటో కెమికల్స్ పుష్కలంగా ఉంటాయి. వీటితో పాటుగా, అర్జునోలిక్ యాసిడ్, గల్లిక్ యాసిడ్, ఎలాజిక్ యాసిడ్ వంటి సమ్మేళనాలు ఉంటాయి. ఇవి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అర్జున్ బెరడులో యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఈ లక్షణాలు కొలెస్ట్రాల్ స్థాయిల్ని తగ్గించడంలో సాయపడతాయి. అర్జున బెరడు అధిక రక్తపోటును నియంత్రిస్తుంది.



అంతేకాదు.. తరచుగా విరేచనాలు, జీర్ణసమస్యలతో బాధపడేవారికి అర్జున బెరడు మంచి ఔషధంగా పనిచేస్తుంది.. ఇందులో ఉండే టానిన్లు అస్ట్రింజెంట్ లక్షణాల్ని కలిగి ఉంటాయి. ఇవి జీర్ణవ్యవస్థలో మంటను తగ్గించడంలో సాయపడతాయి. పైగా కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. శరీరంలోని మంట, వాపుని తగ్గిస్తుంది.

**ఎవరు జాగ్రత్తగా ఉండాలి?**
నిపుణుల అభిప్రాయం ప్రకారం, గుండె లేదా రక్తపోటు మందులు తీసుకునేవారు దీనికి దూరంగా ఉండాలి. మీరు దీన్ని తాగాలనుకుంటే, వైద్యుడిని సంప్రదించండి.

# జొన్నలతో మేలెంతో..

## 10రోజుల్లో స్లిమ్ పక్కా!



**జొన్నల్లో ఐరన్, కాల్షియం, పొటాషియం, పాస్ఫరస్ వంటి పోషకాలు ఉంటాయి. వీటిలోని ఫైబర్ వల్ల కొంచెం తిన్నా కడుపు నిండుగా అనిపిస్తుంది. దీనివల్ల అతిగా తినడం తగ్గుతుంది, ఫలితంగా బరువు తగ్గాలనుకునే వారికి ఇది మంచిది. జొన్నలు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉంటాయి. ఇవి రక్తంలోని షుగర్ లెవల్స్ అకస్మాత్తుగా పెరగకుండా అదుపులో ఉంచుతాయి. వీటిని తీసుకోవడం వల్ల ఫిట్‌గా కూడా మారతారు.**

జొన్నలు తింటే శారీరక లాభాలతో పాటు మానసిక సమస్యలు కూడా దూరమవుతాయి. జొన్నల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు , మినరల్స్ రక్తపోటును తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. జొన్నల్లో విటమిన్స్ థయామిన్, నియాసిన్, ఫోలేట్స్, రిబోఫ్లేవిన్స్‌లు ఉంటాయి. ఇవి మొత్తం ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తాయి. గోధుమలు లేదా ఇతర ధాన్యాలు పడని వారు నిరభ్యంతరంగా ఈ జొన్న ఇడ్లీలను తీసుకోవచ్చు. తయారీ కూడా చాలా సులువు. జొన్నలు ఉపయోగించడం వల్ల శరీరానికి కావాల్సిన అధిక పీచు పదార్థం లభిస్తుంది. ఇలాంటి ధాన్యాలు జీర్ణక్రియను మెరుగు పరచడమే కాకుండా, శరీరానికి నెమ్మదిగా శక్తిని అందిస్తూ రోజంతా ఉత్సాహంగా ఉండేలా చేస్తాయి.



**తయారీ విధానం:**
ముందుగా జొన్న రవ్వను, మినపప్పును విడివిడిగా 5 నుండి 6 గంటల పాటు నానబెట్టాలి. నానిన పప్పును మెత్తగా రుబ్బి, అందులో జొన్న రవ్వను కలిపి ఇడ్లీ పిండిలా తయారు చేయాలి. ఈ మిశ్రమాన్ని రాత్రంతా పులియబెట్టడం చాలా ముఖ్యం. ఇలా చేయడం వల్ల పిండిలో మంచి బాక్టీరియా వృద్ధి చెంది జీర్ణశక్తిని పెంచుతుంది. ఇక ఆ మరుసటి రోజు ఉదయం సాధారణ ఇడ్లీల మాదిరిగానే ఆవిరి మీద ఉడికిస్తే వేడివేడి జొన్న ఇడ్లీలు రెడీ.

చాలామంది జొన్న ఇడ్లీలు గట్టిగా ఉంటాయని భావిస్తారు. కానీ సరైన పద్ధతిలో పులియబెడితే ఇవి చాలా మెత్తగా వస్తాయి. వీటిని అల్లం పచ్చడి, పల్లీల చట్నీ లేదా సాంబార్‌తో తీసుకుంటే రుచి అద్భుతంగా ఉంటుంది. ఆరోగ్యకరమైన మార్పు కోరుకునే వారు వారంలో కనీసం మూడు సార్లు ఇలాంటి చిరుధాన్యాల అల్పాహారాన్ని తీసుకోవడం ఉత్తమం



## భోజనం చేసిన కాసేపటికే

# మళ్లీ ఆకలిగా అనిపిస్తుందా?

## జాగ్రత్త.. డేంజర్ బెల్స్ మోగినట్లే!



చాలా మందికి భోజనం చేసిన కాసేపటికే ఆకలిగా అనిపిస్తుంటుంది. దీంతో స్వీట్లు వంటి ఇంట్లో ఉన్న డిజర్ట్స్ లాగించేస్తుంటారు. అసలు ఇలా ఎందుకు అనిపిస్తుందో మీరెప్పుడైనా ఆలోచించారా? నిజానికి.. మీ ఒంట్లో ఇన్సులిన్ సరిగ్గా పనిచేయడం లేదని చెప్పే సూచిక ఇది. ఇది డయాబెటిస్‌కు సంకేతమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికన్ డయాబెటిస్ అసోసియేషన్ ప్రకారం తరచుగా ఆకలిగా ఉండటం అనేది శరీరంలోని చక్కెర స్థాయిలలో తేడాల కారణంగా ఇన్సులిన్ పనితీరు బలహీనపడుతుందని సూచిస్తుంది. దీని అర్థం శరీరంలోని ఇన్సులిన్ హార్మోన్ రక్తం నుంచి కణాలకు గ్లూకోజ్‌ను సరిగ్గా అందించలేకపోతుంది. దీని కారణంగా, శరీరానికి సరైన శక్తి లభించదు. దీని వల్ల మెదడు పదే పదే ఆకలిని సూచిస్తుంది. వైద్య పరిభాషలో దీనిని పాలీఫాగియా అంటారు. కాబట్టి డయాబెటిస్ హెచ్చరిక సంకేతాలు ఏమిటి, ఈ రకమైన సమస్యను నివారించడానికి ఏమి చేయాలో నిపుణుల మాటల్లో ఇక్కడ తెలుసుకుందాం..

శరీరంలో డయాబెటిస్ మొదలయ్యే ముందు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. చాలా మంది వీటిని సాధారణమైనదిగా విస్మరిస్తారు. కానీ ఇలా చేయడం మంచిది కాదు. ప్రారంభ దశలోనే ఆహారంలో మార్పులు చేసుకోవడం ద్వారా ఇటువంటి వ్యాధులను నివారించవచ్చు. లేకపోతే డయాబెటిస్ మీ జీవితాన్ని నాశనం చేస్తుంది. దీనికి చికిత్స లేనందున దానిని నియంత్రణలో ఉంచడం చాలా అవసరం.

**మధుమేహాన్ని వచ్చే ముందు కనిపించే లక్షణాలు**

ఆకలి పెరగడంతో పాటు దాహం కూడా పెరుగుతుంది.
తరచుగా మూత్ర విసర్జన.
బలహీనత.
మసక దృష్టి.



**ఎవరికి ఎక్కువ ప్రమాదం ఉంది?**

కుటుంబంలో ఎవరికైనా డయాబెటిస్ ఉంటే
స్వీట్లు తినడం... అధిక బరువు ఉండటం
వ్యాయామం లేకపోవడం
ఒకే చోట ఎక్కువసేపు కూర్చుని పనిచేయడం

**ఎలా నివారించాలి?**
కొవ్వు తక్కువగా, ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి.
ప్రతిరోజూ కనీసం 15 నిమిషాలు వ్యాయామం చేయాలి.
తక్కువ చక్కెర తీసుకోవాలి.
మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి.



## పెట్టుబడి అవసరం లేదు..

# రోజుకు 2గంటలు పనిచేస్తే చాలు..

## నెలకు రూ. 1 లక్ష పక్కా!

వ్యాపారం చేయాలనే ఆసక్తి ఉన్నప్పటికీ, పెట్టుబడి లేదనే ఆలోచన చాలామందిని వెనక్కి లాగుతుంది. అయితే, ఈ ఆధునిక యుగంలో పెట్టుబడి లేకుండానే వ్యాపారాన్ని ప్రారంభించడానికి అనేక ఉచిత ఆన్‌లైన్ సాధనాలు అందుబాటులో ఉన్నాయి.

మొదట, మీ వ్యాపారానికి ఒక బ్రాండ్ పేరును ఎంపిక చేసుకోవడం అవసరం. చీుఎవటశ్రీఅఇ లాంటి వెబ్‌సైట్‌లు ఈ ప్రక్రియను సులభతరం చేస్తాయి, ఉచితంగా విభిన్నమైన పేర్లను సూచిస్తాయి. తరువాత, సోషల్ మీడియా మార్కెటింగ్ చాలా కీలకం. ఝఅఝ.ఇశీఎ లాంటి ప్లాట్‌ఫామ్‌లు (గ్రాఫిక్ డిజైనింగ్ నైపుణ్యాలు లేని వారికి కూడా ఆకర్షణీయమైన సోషల్ మీడియా పోస్టులు, వీడియోలు రూపొందించడానికి సహాయపడతాయి. ఇది మీ ఉత్పత్తులు లేదా సేవలను ప్రభావవంతంగా ప్రచారం చేయడానికి ఉపయోగపడుతుంది. వెబ్‌సైట్ అవసరం ఉన్న వారికి ుఎజూావసతీముఎ



వంటి సైట్‌లు ఉచితంగా డ్రాగ్ అండ్ డ్రాప్ పద్ధతిలో వెబ్‌సైట్‌ను డిజైన్ చేసుకునే అవకాశాన్ని కల్పిస్తాయి.

చివరగా, కస్టమర్ల నుండి చెల్లింపులను స్వీకరించడానికి Razorpay, Cashfree లేదా Stripవ వంటి పేమెంట్ గేట్‌వేలు ఉన్నాయి. ఇవి మీ బ్యాంక్ అకౌంట్‌కు లింక్ చేసి, కస్టమర్లు వివిధ పద్ధతులలో (క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్, యూపీఐ) చెల్లింపులు చేయడానికి వీలు కల్పిస్తాయి. ఈ ఉచిత టూల్స్ సహాయంతో, మీరు మొదట్లో ఎలాంటి పెద్ద పెట్టుబడి పెట్టకుండానే మీ వ్యాపార ఆలోచనను మార్కెట్‌లో పరీక్షించుకోవచ్చు. విజయవంతమైతే, అప్పుడు అవసరమైన రిజిస్ట్రేషన్లు, ఇతర లాంఛనాలకు వెళ్లవచ్చు.

# ఉద్రిక్తతలున్నా రాణించిన సూచీలు..

## సెన్సెక్స్ 900 పాయింట్లు పైకి

నినాదం మార్కెట్

***ముంబయి: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రాణించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలకు తోడు, న్యూక్లియర్ ప్రోగ్రామ్‌ను నిలిపివేయడానికి సిద్ధమంటూ ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి పేర్కొన్నారంటూ వచ్చిన వార్తలు మార్కెట్ సెంటిమెంట్‌ను బలోపేతం చేసింది. దీంతో ఉద్రిక్తతల వేళ వరుస నష్టాలు చవిచూసిన సూచీలు.. లాభాల్లోకి వచ్చాయి. దీంతో ఓ దశలో సెన్సెక్స్ 1100 పాయింట్ల మేర లాభపడింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.6 లక్షల కోట్లు పెరిగి రూ.453 లక్షల కోట్లకు చేరింది.***



సెన్సెక్స్ ఉదయం 79,530.48 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 79,116.19) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడిన సూచీలు ఇంట్రాడేలో 80,303.83 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 899.71 పాయింట్ల లాభంతో 80,015.90 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 285.40 పాయింట్ల లాభంతో 24,765.90 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, ఎల్అండ్‌టీ, ఎన్టీపీసీ, రిలయన్స్, బీఈఎల్ స్టాక్స్ లాభపడ్డాయి. టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హిందుస్థాన్ యూనిలీవర్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 82.89 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు 5150 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**లాభాలకు కారణాలు ఇవీ..**



న్యూక్లియర్ ప్రోగ్రామ్‌ను ఆపేందుకు ఇరాన్ అంగీకారం తెలిపినట్లు వార్తలు వచ్చాయి. అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీతో ఇరాన్ చర్చలకు సిద్ధమైందన్న వార్తలూ యుద్ధం త్వరలోనే ముగియబోతుందన్నసంకేతాలిచ్చాయి. అయితే, ఆ వార్తలను ఇరాన్ ఖండించడం గమనార్హం.

మూడు రోజుల వరుస నష్టాల నేపథ్యంలో కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో మన మార్కెట్ సూచీలు లాభపడ్డాయి.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు త్వరలోనే చల్లారొచ్చన్న అంచనాలతో ప్రపంచ మార్కెట్లు నేడు రాణించాయి. నిన్న భారీగా పతనమైన దక్షిణ కొరియా కోస్పీ నేడు 9 శాతం మేర లాభపడింది. జపాన్, హాంకాంగ్, చైనా మార్కెట్లు కూడా రాణించడం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. నిన్నటి అమెరికా మార్కెట్లు కూడా రాణించాయి.

హర్మూజ్ గుండా వెళ్లే నౌకలకు తక్కువ ధరకే బీమా కల్పిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొనడమూ మరో కారణం. అవసరమైతే చమురు నౌకలకు అమెరికా నౌకాదళం ఎస్కార్ట్‌గా పంపిస్తామన్నారు.

డాలరుతో రూపాయి విలువ బలోపేతమైంది. నిన్నటి ట్రేడింగ్ సెషన్‌లో 92 ఎగువకు చేరిన రూపాయి విలువ మళ్లీ 91.60 స్థాయికి చేరింది. దీనికితోడు రిలయన్స్ వంటి అత్యధిక వెయిటేజీ కలిగిన స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలకు దన్నుగా నిలిచింది. క్రూడాయిల్ ధరల పెరుగుదల వల్ల (విండ్‌ఫాల్ ట్యాక్స్ విధించకపోతే) రిలయన్స్ కంపెనీ లాభపడుతుందన్న జెఫ్రీచ్ నివేదిక కొనుగోళ్ల మద్దతుకు కారణమైంది.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విజయవంతం చేయాలి

**జూన్ 12 వరకు 99 రోజుల కార్యక్రమం.. అధికారులతో కలెక్టర్ చిత్రా మిశ్రా సమీక్ష**



**కరీంనగర్, మర్చి 5(నినాదం )** జిల్లాలో ఈ నెల 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల పాటు నిర్వహించనున్న "ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై ఆమె మార్గదర్శకాలు ఇచ్చారు. ఈ కార్యక్రమం ఐదు దశల్లో కొనసాగుతుందని, శాఖల వారీగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. ఏప్రిల్ 2న గ్రామస్థాయిలో గ్రామసభలు, ఏప్రిల్ 16న మండల స్థాయి, మే 2న నియోజకవర్గ స్థాయి, మే 22న జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుతున్న లబ్ధి గురించి వివరించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా 10 అంశాలపై 99 రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దీనికి ప్రణాళిక శాఖ నోడల్‌గా వ్యవహరిస్తుందని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ దస్త్రాల పరిష్కారం, ఆరోగ్యం, సంక్షేమం, పిల్లల భద్రత,మత్తు పదార్థాల నిర్మూలన, రైతు సంక్షేమం వ్యవసాయం, విద్య, యువత క్రీడలు, మహిళలు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై కార్యాచరణ ప్రణాళికను సమావేశంలో పరిశీలించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్, ముఖ్య ప్రణాళికాధికారి రామ్ దత్తారెడ్డి, జిల్లా పరిషత్ ప్రధాన కార్యనిర్వా హణాధికారి శ్రీనివాస్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మ్యూల్ ఖాతాలపై పోలీసుల కఠిన చర్యలు

**34 ఖాతాల గుర్తింపు**
**సైబర్ నేరగాళ్లకు సహకరించిన వారిపై కేసులు**



**కరీంనగర్, మార్చి 5(నినాదం):** సైబర్ నేరాలను అరికట్టేందుకు తెలంగాణ రాష్ట్ర సైబర్ భద్రత విభాగం చేపట్టిన లిలి'ఆపరేషన్ క్రాక్‌డౌన్'లిలిలో భాగంగాకరీంనగర్ పోలీసు కమిషనరేట్ పరిధిలో మ్యూల్ ఖాతాలపై పోలీసులు కఠిన చర్యలు ప్రారంభించారు. స్వల్ప కమీషన్లకు ఆశపడి తమ బ్యాంకు ఖాతాలను సైబర్ నేరగాళ్లకు ఇచ్చిన వ్యక్తులను గుర్తించి విచారణ చేపట్టారు. కరీంనగరలోని 4ప్రధాన బ్యాంకుల్లో మొత్తం 34 మ్యూల్ ఖాతాలను పోలీసులు గుర్తించారు. జాతీయ సైబర్ నేర ఫిర్యాదుల పోర్టల్ ద్వారా ఇప్పటివరకు 162 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఈ ఖాతాల ద్వారా సైబర్ నేరగాళ్లు సుమారు వెయ్యికి పైగా అక్రమ లావాదేవీలు జరిపినట్లు విచారణలో వెల్లడైంది. ఈ వ్యవహారంలో ఇప్పటికే 20 కేసులు నమోదు చేసి, నిందితులపై భారతీయ న్యాయ సంహిత 112వ సెక్షన్ ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. పోలీసు కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, కొందరు వ్యక్తులు స్వల్ప కమీషన్లకు లోబడి తమ బ్యాంకు ఖాతా వివరాలు, వాటికి అనుసంధానమైన ఫోన్ నంబర్లను అపరిచితులకు ఇస్తున్నారని చెప్పారు. సైబర్ నేరగాళ్లు బాధితుల నుంచి దోచుకున్న డబ్బును ఈ మ్యూల్ ఖాతాల ద్వారా మళ్లించి వినియోగిస్తున్నారని వివరించారు. తెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతాలను అద్దెకు ఇవ్వడం లేదా వివరాలు పంచుకోవడం కూడా నేరమని, అలాంటి వారిని సైబర్ నేరాలకు సహకరించిన నిందితులుగానే పరిగణిస్తామని హెచ్చరించారు.ప్రజలు తమ బ్యాంకు ఖాతా, ఏటీఎం కార్డు, ఒకసారి వినియోగించే సంకేత సంఖ్య వంటి వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అపరిచితులకు ఇవ్వకూడదని సూచించారు. నెలవారీ కమీషన్లు ఇస్తామని ఖాతాలను వినియోగించుకోవాలని చెప్పే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఖాతాలో అనుమానాస్పద లావాదేవీలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు .బ్యాంకు అధికారులతో సమన్వయం చేసుకుంటూ మ్యూల్ ఖాతాదారుల పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, విచారణను వేగవంతం చేసి మిగిలిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

## మైనార్టీ నేతకు దక్కిన అరుదైన గౌరవం

**20వ వార్డు అధ్యక్షుడిగా నియమించిన ప్రణవ్**
**పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తా..**
**కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు సలీంపాష**



**జమ్మికుంట, మార్చి 5 (నినాదం) :** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 20వ వార్డుకు చెందిన మైనార్టీ నేత మహమ్మద్ సలీం పాషాను వార్డు అధ్యక్షుడిగా హుజురాబాద్ నియోజ కవర్గం ఇంచార్జ్ ప్రణవ్ బాబు నియమించారు. తనపై నమ్మకం తో ఈ అవకాశాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజక వర్గం ఇన్చార్జి ప్రణవబాబుకు మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్ దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు జిల్లా అధ్యక్షులు మేడిపల్లి సత్యంకు సలీం కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సలీం మాట్లాడుతూ, మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 20 వార్డు నుండి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నన్ను అదే వార్డు అధ్యక్షుడిగా నియమించడం సంతోషంగా ఉందని తెలిపారు. నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ముందుకు వెళ్తానని వార్డు సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకు వేళ్తూ సమస్యల పరిష్కారం కోసం నియోజకవర్గ ఇన్చార్జి దృష్టికి తీసుకు వెళ్తానని తెలిపారు. నా నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి ల సహాయ సహకారాన్ని మర్చిపోలేనని వారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నారని తెలిపారు. భవిష్యత్తులో ఇన్చార్జ్ ఆదేశాల మేరకు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

## ఇచ్చినమాట నిలబెట్టుకున్న వార్డు మెంబర్

**ఆడపిల్ల పెళ్లికి కానుకగా రూ.5,016**



**జమ్మికుంట మార్చి 5 (నినాదం):** జమ్మికుంట మండలం బిజిగిరి షరీఫ్ గ్రామపంచాయతీ ఒకటో వార్డ్ మెంబర్ ఎర్ర రాజు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. తాను ఎన్నికల సమయంలో ఇచ్చిన మేనిఫెస్టో భాగంగా ఒకటో వార్డులో ముత్యాల శ్రీనివాస్ రంజిత కుమార్తె అక్షయ వివాహానికి.. ఒక అన్నగా రూ. 5,016 ఆర్థిక సాయం గా అందజేశారు. ఇలాగే పలు కార్యక్రమాల్లో ముందు ఉంటానని, ఒకటో వార్డు అభివృద్ధి కోసం ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు చేస్తాను అనీ రాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు ఎర్ర రాజు ను గ్రామస్తులు అభినందించారు. ఇచ్చిన హామీ ప్రకారం సాయం చేయడం మంచి విషయమని పేర్కొన్నారు.

## శిల్పకళా వేదిక దిశగా వేలాదిగా తరలిరండి

**మంత్రి లక్ష్మణ్ కుమార్**



**ధర్మపురి మార్చి 5( నినాదం):** ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తూ మాదిగ వర్గానికి ప్రభుత్వ ఉద్యోగాల్లో న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఘన సన్మానం నిర్వహించేందుకు మాదిగ ఉద్యోగులు భారీగా సమీకరించాల్సిందిగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు.హైదరాబాద్ హైటెక్ సిటీలోని శిల్పకళా వేదికలో మధ్యాహ్నం 12 గంటలకు తెలంగాణ రాష్ట్ర మాదిగ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్మాన సభ నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలకు మాదిగ సమాజం తరపున కృతజ్ఞతగా ఈ సభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాతో పాటు మాదిగ సామాజిక వర్గానికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు.రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న మాదిగ ఉద్యోగులు, సంఘాల నాయకులు, సామాజిక వర్గ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ముఖ్యమంత్రి సన్మాన సభను విజయవంతం చేయాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు.

## కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మేయర్, ఉపమేయర్

**పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు**



**కరీంనగర్, మార్చి 5(నినాదం):** జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ చిత్ర మిశ్రా ని నూతనంగా ఎన్నికైన కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ మేయర్, ప్రస్తుత ఉప మేయర్ యాదగిరి సునీల్ రావు కూడా ఆయనతో కలిసి పాల్గొన్నారు.ఈ భేటీలో ప్రజాప్రతినిధులు కలెక్టర్ చిత్ర మిశ్రాకి పూలమొక్కలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్పొరేషన్‌లో పలు అభివృద్ధి పనులపై కలెక్టర్‌తో కలసి చర్చించారు.

## ఘనంగా వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవ వేడుకలు ప్రత్యేకపూజలు హోమాలు నిర్వహించిన భక్తులు





**జమ్మికుంట, మార్చి 5 (నినాదం)** జమ్మికుంట పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో 30 సంవత్సరాల వార్షికోత్సవ వేడుకలు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్యుల కులదైవమైన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఉదయం వాసవి మాతకు 108 కళాశాలతో ప్రత్యేక అభిషేకాలు వెండి చీరతో అలంకారం ప్రత్యేక పూజలు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ ముక్కా జితేందర్ గుప్తా తెలిపారు. శ్రీ సూక్తా దేవి సూక్త దుర్గాసూక్త వాసవి మాత మూలమంత్ర హవనములు హోమాలు వేద పండితులు మండలేముల దుర్గాప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. వాసవి మాత ఆలయ వార్షికోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పట్టణంలోని ఆర్యవైశ్యులు భారీ సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి కృపకు పాత్రులు అయ్యారని అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని వారు కోరారు.కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ముక్కా కాశయ్య తో పాటు వాసవి సేవా సమితి సభ్యులు ఆర్యవైశ్య కుటుంబాల సభ్యులు మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## టీఎన్జీవో సభ్యత్వ నమోదు వేగవంతం



**మెడికల్, పశుసంవర్ధక, ట్రెజరీ శాఖల్లో ఉత్సాహంగా సభ్యత్వం నమోదు**
**సంఘ బలానికి పునాది టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి**

**కరీంనగర్, మర్చి 5(నినాదం):** తెలంగాణ ఎన్జీవో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం కరీంనగర్ జిల్లాలో వేగంగా కొనసాగుతోంది.ఇందులో భాగంగా మెడికల్- ఆరోగ్య, పశుసంవర్ధక ,జిల్లా ట్రెజరీశాఖ ఉద్యోగులు ఉత్సాహంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.మెడికల్-ఆరోగ్యశాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్యోగి నాయకులు గోవిందపతి శ్రీనివాస్, జీవన్‌రెడ్డి,పాండు,ప్రదీప్‌కుమార్ సమన్వయం చేశారు. పశుసంవర్ధక శాఖలో గిరిధర్ రావు, కమలాకర్, అభిషేక్‌రెడ్డి నేతృత్వంలో సభ్యత్వ నమోదు చేపట్టగా, జిల్లా ట్రెజరీ శాఖలో ఉప డైరెక్టర్ నాగరాజు, కొండయ్య, శశి, మహేందర్, రాధా లక్ష్మి పాల్గొన్నారు. కార్యక్రమానికి ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఉద్యోగులహక్కుల సాధనలో తెలంగాణ ఎన్జీవో సంఘం ఎల్లప్పుడూ ముందుండి పోరాటం చేస్తుందని చెప్పారు. సభ్యత్వం అంటే కేవలం డబ్బులు కాదని, సంఘ బలాన్ని పెంచే పునాది రాళ్లను సమీకరించడమేనని పేర్కొన్నారు.మెడికల్-ఆరోగ్యశాఖఉద్యోగులు ప్రజలకు, ప్రభుత్వానికి బాధ్యతతో సేవలంది స్తున్నారని కొనియాడారు. ఆరోగ్య అత్యవసర పరిస్థితుల్లో వారు యుద్ధరంగంలోని సైనికుల్లా ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్నారని ప్రశంసించారు. పశుసంవర్ధకశాఖ ఉద్యోగులు మూగజీవాలకు సేవలందిస్తూ సమా జానికి కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని చెప్పారు. ఉద్యోగులంతా ఐక్యంగా ఉంటేనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సంయుక్త డైరెక్టర్ నల్ల లింగారెడ్డి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, టీఎన్జీవో జిల్లా నాయకులు సంగ్యం లక్ష్మణరావు, ముప్పిడి కిరణ్ కుమార్, సర్దార్ అరవింద్ సింగ్, గూడ ప్రభాకర్ రెడ్డి, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉద్యోగులు రాజేష్, హైమావతి, హరిప్రియ, జగన్ గౌడ్, విజయలక్ష్మి, తోటరాజు పాల్గొన్నారు.

# పసిపిల్లలు భగవంతుడితో సమానం

**జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్..**
**అంగన్వాడి కేంద్రంలో సామూహిక అన్నప్రాసన**



**జమ్మికుంట,మార్చి5 (నినాదం):** పసిపిల్లలు దేవుడితో సమానమని అలాంటి పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు గురువులపై ఉంటుందని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులో గల అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన సామూహిక అన్నప్రాసన కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్ ప్రశాంత్.ఆయన మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల ద్వారా పిల్లలకు పౌష్టిక నాణ్యమైన ఆహారాన్ని అందిస్తూ పోషక ఆహార లోపాన్ని నివారించడానికి శిశువులకు సరైన పోషకాలు అందేలా చూసుకోవాలని తెలిపారు. పిల్లలకు తల్లిపాలే శ్రేష్టమని వాటితో పాటు నాణ్యమైన ఆహారాన్ని పిల్లలకు అంగడి వాడి కేంద్రాల ద్వారా అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పిల్లలకు అన్నప్రాసన చేసి వారిని ఆశీర్వదించారు. అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు తీసుకోవాలని సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పిల్లలకు అందించే ఆహారం విషయంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని వారి బంగారు భవిష్యత్తు బాగుంటేనే రేపు దేశ భవిష్యత్తు బాగుంటుందని అలాంటి పసిపిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ చుంచు రమాదేవి ములుగు ప్రణీత తోపాటు అంగన్వాడి టీచర్ పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ సమస్యలపై మంత్రి అడ్లూరి ఫోకస్...

**రూ.30 లక్షల మంజూరు**

**ధర్మపురి,మార్చి5( నినాదం):** ధర్మపురి పట్టణంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం ఊతమిచ్చింది. తెలంగాణ రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పట్టణంలో అత్యవసరంగా భావించిన పలు పనుల కోసం మొత్తం రూ.30 లక్షల నిధులను మంజూరు చేశారు. పట్టణంలోని కమలాపూర్ ఫీడర్ ప్రధాన రహదారిలో ఇండ్లపైగా వెళ్తున్న 11 కేవీ విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ కోసం రూ.10 లక్షలు కేటాయించారు.
ఈ లైన్లు ఇండ్లపైగా ఉండటంతో ప్రజలు చాలా కాలంగా భయాందో ళనలకు గురవుతుండగా, స్థానిక ప్రజాప్రతినిధుల వినతిపై మంత్రి స్పం దించి వెంటనే నిధులు విడుదల చేయడం విశేషం.అలాగే ప్రఖ్యాత క్షేత్ర మైన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి చెందిన సంపు బ్రహ్మ గుండం నుండి నీటి సరఫరా, వాటర్ ట్యాంకర్ ఫిల్లింగ్ సదుపాయం కోసం రూ.8 లక్షలు మంజూరు చేశారు. భక్తు లకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఈ చర్య తీసుకున్నట్లు ఆలయ చైర్మన్ జక్కు రవీందర్, ఈవో శ్రీనివాస్ తెలిపారు. ఇక ధర్మపురి ప్రభుత్వ డిగ్రీ కళాశాల త్వరలో తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో కాలేజీ భవనం లోని తరగతి గదుల మరమ్మతులకు రూ.12 లక్షలు మంజూరు చేసినట్లు మంత్రి ప్రకటించారు.
దీని ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధిపై ప్రభు త్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యమని మంత్రి స్పష్టం చేసారు.
నిధుల కేటాయింపు సందర్భంగా ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి రాజు, వైస్ చైర్‌పర్సన్ ఇందారపు రామన్న, కౌన్సిలర్లు మరియు మున్సిపల్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ రావు పట్టణ అభివృద్ధికి నిధులు మం జూరు చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ధర్మపురి ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికకు సన్నాహాలు

**66 డివిజన్లలో 99రోజులపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యాచరణ**
**నేడు ప్రారంభం: మేయర్ కొలగాని శ్రీనివాస్**




**కరీంనగర్, మార్చి5(నినాదం):** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన,ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమం కోసం గురువారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో పారిశుధ్యం, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ, స్థాపన, జనన-మరణ విభాగాల అధికారులతో సన్నాహక సమావేశం జరిగింది. నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మేయర్ అతిథిగా హాజరయ్యారు.66 డివిజన్లలో 99 రోజులపాటు చేపట్టాల్సిన కార్యక్రమాలు, పరిష్కరించాల్సిన ప్రజా సమస్యలపై మేయర్, కమిషనర్ అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం మార్చి 6నుండి జూన్12 వరకు కొనసాగనుంది. ప్రారంభదశలో మార్చి 6నుంచి 15 వరకు మొదటి పది రోజులపాటు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని నిర్ణయించారు.మొదటి పది రోజులలో ప్రతిరోజూ ఐదు డివిజన్లలో పారిశుధ్య కార్యక్రమాలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టనున్నారు. మార్చి6న మొదటిరోజు 1,2 డివిజన్ల పరిధిలోని హనుమాన్‌నగర్, చంద్రపురి కాలనీలలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. నగరపాలక సంస్థ కార్యాలయం. పరిసర ప్రాంతాలను శుభ్రపరచడంతో కార్యక్రమం ప్రారంభమవుతుంది.ఈ దశలో వివిధ విభాగాల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారు. అనంతరం డివిజన్ల వారీగా పారిశుధ్యం, అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాలు చేపడతారు. గౌరవ కార్పొరేటర్లు, అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. మేయర్‌కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ పారిశుధ్య పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని, డ్రైనేజీల శుభ్రపరిచడం, ఖాళీ స్థలాలు పరిశుభ్రం చేయడం, చెత్త నిల్వ కేంద్రాలు శుభ్రపరచడం, నిర్మాణ వ్యర్థాలను తొలగించడం, సిల్ట్ తొలగించడం, కలుపు మొక్కలను తొలగించడం వంటి పనులను పూర్తి చేయాలని సూచించారు. అలాగే నీటి సరఫరాలో లీకేజీలను గుర్తించి అరికట్టడం, పార్కులను శుభ్రపరచడం, ఓపెన్ జిమ్‌ల మరమ్మతులు చేయడం, వీధి దీపాలను మరమ్మతు చేసి అవసరమైన చోటకొత్తదీపాలు ఏర్పాటు చేయాలని అన్నారు.నగరమంతా వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.చిన్న చిన్న అభివృద్ధి పనులకు నామినేషన్ విధానంలో నిధులు కేటాయించి వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. భవన నిర్మాణ అనుమతులు తదితర పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ప్రజలు, కార్పొరేటర్ల సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, ప్రజా పాలన,ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. పారిశుధ్యం, నీటి సరఫరా, రోడ్లు, డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. జనన--మరణ నమోదు, ఆస్తి అంచనా, వాణిజ్యఅనుమతులు,గృహ నిర్మాణ అనుమతులు, నీటి కనెక్షన్లు, మ్యూటేషన్ వంటి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సమావేశంలోడిప్యూటీ కమిషనర్ వేణు మాధవ్‌తో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## సిద్ధార్థలో విద్యార్థులకు పట్టాభిషేకోత్సవం

**లయన్స్ క్లబ్ శాతవాహన ఆధ్వర్యంలో కౌమార దశ అవగాహన, నాయకత్వ వికాస శిక్షణకు ముగింపు**
**సిద్ధార్థ పాఠశాలల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి**



**కరీంనగర్, మార్చి 5(నినాదం):** సిద్ధార్థ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ భగత్‌నగర్ పాఠశాలలో లయన్స్ క్లబ్ కరీం నగర్ శాతవాహన ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం నిర్వహించిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమం విజయవంతంగా పూర్తైంది. లయన్స్ కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో జూలై 13, 14 తేదీలలో ఉపాధ్యా యులకు శిక్షణ తరగతులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా 6, 7, 8 తరగతుల విద్యార్థులకు కౌమార దశలో జరిగే శారీరక-మానసిక మార్పులు, నాయకత్వ లక్షణాల అభివృద్ధి వంటి అంశాలపై నెలకు మూడు తరగతుల చొప్పున మొత్తం 35 పాఠాలు నిర్వహిం చారు.ఈ శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా గురువారం (మార్చి 5) మంకమ్మతోటలోని సిద్ధార్థ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ఘనంగా పట్టాభిషేకోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్ సింహరాజు కోదండరామ్ హాజరయ్యారు. సిద్ధార్థ పాఠశాలల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి, అనంతుల శివప్రసాద్, ముచ్చ రాజిరెడ్డి, సింగిరెడ్డి వాసుదేవ రెడ్డి, గాలిపల్లి వెంకట్, ఎనుగుర్తి రమేష్, పోతాని ప్రవీణ్ కుమార్, బుర్ర మధుసూదన్ రెడ్డి, వి. జగదీశ్వర చారి, వి. ససికాంత్ వర్మ, దాసరి తిరుపతి రెడ్డి, గాండ్ల చంద్రశేఖర్, పచ్చునూరి సురేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ విద్యార్థులకు అంతర్జాతీయ ఆంగ్ల ఒలింపియాడ్‌లో పతకాలు

**డాక్టర్ వి. నరేందర్ రెడ్డి**



**కరీంనగర్, మార్చి 5(నినాదం):** కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ ఆంగ్ల ఒలింపియాడ్‌లో ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభకు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఆంగ్ల భాషపై పట్టు సాధించడం ద్వారా సంభాషణా నైపుణ్యాలు పెరిగి సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందవచ్చని తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థికి భాషా నైపుణ్యాలు అత్యంత అవసరమని, వాటి ద్వారా ఉన్నత అవకాశాలను అందుకొని విజయవంతమైన జీవితాన్ని నిర్మించుకోవచ్చని పేర్కొన్నారు. క్రమమైన సాధనతో ఆంగ్ల భాషను ధారాళంగా మాట్లాడే స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. ఇటీవల సిల్వర్ జోన్ ఫౌండేషన్ నిర్వహించిన అంతర్జాతీయ ఆంగ్ల ఒలింపియాడ్‌లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. నాలుగో తరగతిలో వి. వేదవిహార్ బంగారు పతకం, ఏ. శ్రియాన్ రెడ్డి రజత పతకం, జి. విశాల్ కాంస్య పతకం సాధించారు. ఆరో తరగతిలో కే. సుకృత బంగారు పతకం అందుకుంది. ఏడో తరగతిలో బి. తన్మయి బంగారు పతకం, ఏం. లిఖిత్ రజత పతకం, పి. సుశ్రిత్ కాంస్య పతకం గెలుచుకున్నారు. ఎనిమిదో తరగతిలో ఏం. విగ్నేష్ చంద్ర బంగారు పతకం, ఎల్. అక్షయ రజత పతకం సాధించారు. తొమ్మిదో తరగతిలో టి. అమిత విక్రమ్ బంగారు పతకం, సిహెచ్ శ్రీహిత రజత పతకం, ఏ. యాష్ చంద్ర కాంస్య పతకం అందుకున్నారు.పతకాలు సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్చాలు అందజేసి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తోటి కార్మికుడి కుటుంబానికి అండగా మెట్‌పల్లి పెయింటర్స్ యూనియన్

**రూ.30 వేల ఆర్థిక సాయం అందజేత**
**లేబర్ కార్డు తప్పనిసరి: ఏశమేని గణేష్**



**మెట్‌పల్లి, మార్చి 5 ( నినాదం):** పట్టణానికి చెందిన పెయింటర్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబానికి మెట్‌పల్లి డివిజన్ పెయింటర్స్, పీటీపీ వర్కర్స్ యూనియన్ అండగా నిలిచింది. యూనియన్ సభ్యులు స్వచ్ఛందంగా విరాళాలు సేక రించి రూ.30,000 నగదును మృతుడి భార్య బుర్ర కవితకు, గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబానికి తమ సంఘీభావాన్ని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు ఏశమేని గణేష్ మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడు తప్పనిసరిగా లేబర్ కార్డు పొందాలని సూచించారు. లేబర్ కార్డు కలిగిన కార్మికుడు సాధారణ మరణం సంభవిస్తే ప్రభుత్వం నుంచి రూ.2 లక్షల ఆర్థిక సాయం, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షల వరకు బీమా సాయం లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సంక్షేమ పథకాలను ప్రతి కార్మికుడు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ 6వ వార్డు ఇంచార్జ్ బుర్ర మహేందర్ గౌడ్, సంఘ ఉపాధ్యక్షులు ఖాతా వినయ్, ఓడల రాకేష్, క్యాషియర్ మాతంగి శ్రావణ్, ప్రధాన కార్యదర్శి బిజనపల్లి మనోహర్, రైటర్ చౌదరి శివకుమార్, పొన్నాల వినయ్, బజరంగ్ తడాస్, జనగాం సంపత్, బోయిని రామచందర్, జనగాం రమేష్, జనగాం నరసింహులు, షేక్ సోను, మారంపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.తోటి కార్మికుడి కుటుంబానికి యూనియన్ అందించిన ఈ సాయం స్థానికంగా ప్రశంసలు పొందుతోంది.



# ఇంటర్ పరీక్షా కేంద్రాల తనిఖీ

## అధికారులకు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచనలు

**నల్లగొండ ప్రతినిధి మార్చి 5 (నినాదం)**

జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణను పరిశీలించేందుకు పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం నల్గొండ జిల్లా కేంద్రంలో ఆల్ఫా జూనియర్ కాలేజ్, వేదాంత జూనియర్ కాలేజ్ లలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యంగా త్రాగునీరు, శుభ్రమైన మూత్రశాలలు, ప్రథమ చికిత్సతో కూడిన మెడికల్ సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా చర్యలు కట్టుదిట్టంగా ఉండాలని, మాల్ ప్రాక్టీస్ లేదా మాస్ కాపీయింగ్ వంటి ఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే పరీక్షా హాలులోకి అనుమతించాలని పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. డి ఐ ఈ ఓ దస్రు నాయక్, అధికారులు ఉన్నారు.

# రీవీగా పోలీస్ ఠాణాకేగిన నరసింహుడు

## పోలీసు స్టేషన్‌లో పూజలు అందుకుంటున్న నృసింహుడు

**రక్షక భటులతో జగత్ రక్షకుడి దక్షిణ దిగ్యాత్ర**

**దేశంలో ఎక్కడా లేని విశిష్ట సంప్రదాయం ధర్మపురిలో...**

**ధర్మపురి, మార్చి 5 (నినాదం):**
దేశంలో ఎక్కడా కనిపించని విశిష్ట సంప్రదాయం జగిత్యాల జిల్లా ధర్మపురిలో ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాల సందర్భంగా దర్శనమిస్తుంది. ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన దక్షిణ దిగ్యాత్ర కార్యక్రమం అత్యంత వైభవంగా, భక్తి పారవశ్యంతో సాగింది. జగత్ రక్షకుడైన నరసింహ స్వామి స్వయంగా రక్షక భటుల నిలయమైన పోలీస్ ఠాణాకు విచ్చేసి పూజలు అందుకోవడం ఈ ఉత్సవానికి ప్రత్యేకతగా నిలుస్తోంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ యోగానంద, ఉగ్ర నరసింహస్వామి వారి తెప్పోత్సవం, డోలోత్సవ సేవలు ముగిసిన అనంతరం స్వామివారు లక్ష్మీ సమేతుడై దక్షిణ దిశగా యాత్ర ప్రారంభిస్తారు. దక్షిణ దిశలో ఉన్న రక్షక భట్ నిలయమైన పోలీస్ స్టేషన్‌కు గోధూళి వేళ చేరుకుని అక్కడి అధికారులతో ప్రత్యేక పూజలు చేయించుకోవడం అనాదిగా వస్తున్న ఆచారంగా కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా పోలీస్ స్టేషన్‌లో స్వామివారు పూజలందుకునే అరుదైన ఘటనగా ఇది గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా ధర్మపురి పోలీస్ సిబ్బంది సంప్రదాయ దుస్తులు ధరించి ఆలయానికి చేరుకుని భక్తి శ్రద్ధలతో స్వామివారి ఉత్సవ మూర్తులు ఉన్న సేవను స్వయంగా తమ భుజాలపై ఎత్తుకున్నారు. మంగళ వాయిద్యాలు, జానపద





కళారూపాలు, హారతుల మధ్య ఊరేగింపుగా స్వామివారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ దృశ్యం చూసేందుకు భక్తులు భారీగా తరలివచ్చి భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికను వివిధ వర్ణాల పుష్పాలు, అరటి ఆకులతో సుందరంగా అలంకరించారు. ఆ వేదికపై స్వామి వారిని ఆసీనులుగా ప్రతిష్ఠించి ఆలయ అర్చకులు, వేద పండితులు పోలీసు అధికారులతో కలిసి సంకల్పపూర్వకంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి మంగళహారతులు సమర్పించారు. చుట్టుపక్కల వీధుల్లో మహిళలు, భక్తులు వందల సంఖ్యలో మంగళహారతులతో స్వామివారిని ఘనంగా స్వాగతించి భక్తి భావంతో సేవించారు. పోలీస్ స్టేషన్ ప్రాంగణం భక్తుల జయజయధ్వానాలతో మార్మోగింది. భక్తుల రద్దీతో పోలీస్ స్టేషన్ పరిసరాలు పండుగ వాతావరణాన్ని తలపించగా, రక్షక భటుల చేతుల్లోనే జగత్ రక్షకుడు పూజలందుకోవడం ధర్మపురి బ్రహ్మోత్సవాల విశిష్టతను మరోసారి చాటిచెప్పింది. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎస్డీపీవో రఘుచందర్, ధర్మపురి సీఐ రాం నర్సింహారెడ్డి, మల్యాల సీఐ రవి, జగిత్యాల సీఐ కరుణాకర్, ధర్మపురి ఎస్ఐ మహేష్, వెల్గటూర్, గొల్లపల్లి , మేడిపల్లి ఎస్ఐలు ఉదయ్ కుమార్,క్రిష్ణసాగర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి తో పాటు జగిత్యాల సబ్ డివిజన్ పోలీసులు కుటుంబ సభ్యులు , దేవస్థాన ఈవో సంకటాల శ్రీనివాస్, చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తల మండలి సభ్యులు, మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి రాజు, వైస్ చైర్మన్ ఇందారపు రామన్న 15 వార్డుల కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్‌పై క్రిమినల్ కేసు నమోదు

## ప్రజాపంపిణీ వ్యవస్థలో లోపాలు జరిగితే చర్యలు తప్పవు: సివిల్ సప్లై అధికారి చందన్ కుమార్ వెల్లడి

**ఖమ్మం, మార్చి 5 (నినాదం)**
రేషన్ షాపులో బియ్యం నిల్వలు తక్కువగా వున్న కారణంగా ఒక రేషన్ డీలర్ షాపు డీలర్ పై క్రిమినల్ కేసు నమోదు జరిగిన సంఘటన ఖమ్మం జిల్లాలో చోటు చేసుకుంది. వివరాలిలావున్నాయి.. చింతకాని మండలం, నాగిలిగొండ గ్రామంలో చందన్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ షాపులో నిల్వల లోపం – డీలర్స్ పై 6A కేసు తో పాటు ,క్రిమినల్ కేసు కూడా నమోదు చేశారు. గురువారం ఖమ్మం జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి ఖమ్మం చింతకాని మండలంలోని నాగిలిగొండ గ్రామంలో గల రేషన్ షాపు (2242005)ను ఆకస్మిక కంగా తనిఖీలో లోపాలు బహిర్గతం కావడంతో కేసుల



పర్వం మొదలైంది. ఈసందర్భంగా చందన్ కుమార్ మాట్లాడుతూ.ప్రజాపంపిణీ ప్రజలకు బియ్యం సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేసే బాధ్యత ప్రతి రేషన్ డీలర్ పై ఉందని, ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు..షాపులో నిల్వ ఉండవలసిన 112.61 క్వింటాళ్ళ సరుకుకు బదులుగా 52.50 క్వింటాళ్ళు మాత్రమే ఉన్నట్లు గుర్తించడం జరిగిందని, 60.11 క్వింటాళ్ళ నిల్వ తక్కువగా ఉన్నట్లు తేలడంతో క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు డి సి ఎస్. ఓ చందన్ కుమార్ వెల్లడించారు. ఇది పేదల హక్కులను హరించే విధంగా వ్యవహరించిన వారిపై కేసులు తప్పవని ఆయన హెచ్చరించారు. ఖమ్మం జిల్లాలోని అన్ని రేషన్ షాపుల డీలర్లు సక్రమంగా రేషన్ బియ్యంను పంపిణీ చేయాలని, నిల్వలలో తేడా వస్తె చర్యలు తప్పవన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అర్హులైన లబ్దిదారులకు చేరాల్సిన నిత్యావసర సరుకుల పంపిణీలో నిర్లక్ష్యం, అవినీతి జరిగితే చట్టపరమైన చర్యలుంటాయన్నారు. రేషన్ బియ్యం దారి మళ్లించడం కూడా నేరమేనని ఆయన అన్నారు.జిల్లాలోని అన్ని రేషన్ షాపులపై నిరంతర తనిఖీలు కొనసాగుతాయని, ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించే డీలర్లపై యాక్షన్ ఉంటుందని తెలిపారు.

# విద్యార్థులకు సులభ పద్ధతిలో బోధించాలి

**కోదాడ, మార్చి 5(నినాదం):**
ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు సులభ పద్ధతిలో విద్యాబోధన బోధించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ఉపాధ్యాయుల కు ఆదేశించారు. మండల పరిధిలోని ఆకుపాముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. తొలుత ఉన్నత పాఠశాల ను సందర్శించిన ఆయన విద్యార్థుల హాజరు వివరాలు తెలుసుకొని, ముఖ గుర్తింపు విధానంలో హాజరు నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది , పదో తరగతుల గదులను సందర్శించి విద్యార్థులతో నేరుగా మాట్లాడి బోధన విధానంపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అన్ని తరగతులను పరిశీలించిన కలెక్టర్, ఏడు, ఎనిమిది,తొమిది తరగతి, పదవ తరగతి విద్యార్థులతో అన్ని సబ్జెక్టులలో మాట్లాడించి వారిగా పఠన నైపుణ్యాలను పరిశీలించారు. పాఠశాల ప్రాంగణ పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలు, పరిశీలించారు. కుర్చీలు, బెంచెస్ కొరకు ప్రతిపాదనలు సమర్పించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని సబ్జెక్ట లలో పట్టు సాధించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు



సూచించారు. పదాలు సరైన ఉచ్చారణ, అర్థ వివరణతో పాటు ఆంగ్ల పదాలను తెలుగులో సరిగ్గా అనువదించి బోధించాలని తెలిపారు. విద్యార్థులు చదివింది అర్థం చేసుకోవడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. విద్యార్థి క్రమశిక్షణతో విద్యాభ్యాసాన్ని చేయాలన్నారు. ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధతో వినాలన్నారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలను పెన్నులను అందించారు.ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు ఓటిటిలోకి..
# భర్తమహాశయులకు విజ్ఞప్తి





మాస్ మహారాజ రవితేజ నటించిన చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. కిషోర్ తిరుమల దర్శకత్వం వహించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా రిలీజ్ అయి ప్రేక్షకుల నుంచి ఓ మాదిరి స్పందన అందుకుంది. అయితే ఈ సినిమా ఇప్పటి వరకు ఓటిటి స్ట్రీమింగ్ మాత్రం కాలేదు. సాధారణంగా థియేటర్ విడుదలైన సినిమాలు 4 నుంచి 6 వారాల్లో ఓటిటిలోకి వస్తాయి. అయితే 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' విషయంలో స్ట్రీమింగ్ కాలేదు. ఈ సినిమా డిజిటల్ రైట్స్ ను ప్రముఖ ఓటిటి ప్లాట్‌ఫామ్ జీ 5 కొనుగోలు చేసింది. ఆ మధ్య స్ట్రీమింగ్ చేస్తున్నట్టు ప్రకటించారు కానీ అనుకోని కారణాల వలన వాయిదా వేశారు. అనేక మార్లు ఓటీటీ స్ట్రీమింగ్ వాయిదా వేసిన ఈ సినిమా మొత్తానికి ఓటీటీ రిలీజ్ డేట్ లాక చేసుకుంది. ఈ సినిమాను ఈ నెల 13 నుంచి స్ట్రీమింగ్‌కు తీసుకురాబోతున్నారు. థియేటర్ రిలీజ్‌కు సుమారు 59 రోజుల తర్వాత ఓటిటిలో స్ట్రీమింగ్‌కు రానుండటం గమనార్హం. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం ఈ ఎక్కువ క్షి విండోకి మధ్యలో ఎదురైన కొన్ని ఆర్థిక సమస్యలే కారణమని తెలుస్తోంది. అయితే ఈ విషయంపై చిత్ర బృందం లేదా ఓటిటి ప్లాట్‌ఫామ్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మరి ఈ సారైనా ఓటీటీ స్ట్రీమింగ్ కు వస్తుందో లేదా మరోసారి వాయిదా వేస్తారో మరికొద్ది రోజుల్లో తెలుస్తుంది. మరి ఓటిటిలో విడుదలైన తర్వాత ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి ఎలాంటి స్పందన అందుకుంటుందో చూడాలి.



# ఉగాదికి ఉస్తాద్ ఊచకోత

## 19నే వస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్

'ఉస్తాద్ భగత్ సింగ్'గా ప్రేక్షకుల్ని పలకరించేందుకు సిద్ధమవుతున్నారు కథానాయకుడు పవన్ కల్యాణ్ . ఆయన టైటిల్ పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని హరీశ్ శంకర్ తెరకెక్కించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు. ఉగాదికి దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు అధికారికంగా వెల్లడించారు. మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నట్లు తెలిపారు. 'ఈ ఉగాదికి ఉస్తాద్ ఊచకోత' అంటూ కొత్త పోస్టర్‌ను మేకర్స్ పంచుకున్నారు. మొదట ఈ చిత్రాన్ని మార్చి 26న విడుదల చేయాలని భావించారు. అన్ని పనులు పూర్తి కావడంతో వారం ముందుగానే మార్చి 19న ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు సిద్ధమయ్యారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ మూవీలో శ్రీలీల, రాశీఖన్నా కథానాయికలు. పోలీస్ ఆఫీసర్‌గా పవన్ స్టైలిష్‌గా కనిపించనున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన పాటలు, వీడియోలు మంచి ఆదరణను సొంతం చేసుకున్నాయి.

NINADAM CINEMA



## తమిళ అమ్మాయి
# కొరియా టూర్
### మేడ్ ఇన్ కొరియా ట్రైలర్ విడుదల

మీకు అత్యంత సన్నిహితులైన వ్యక్తులే మీ మనసుని ఎక్కువగా పరీక్షిస్తారంటూ తన కలల ప్రపంచంలోని పరిస్థితుల గురించి పంచుకుంటోంది హీరోయిన్ ప్రియాంక అరుళ్ మోహన్. చిన్న గ్రామంలో కలలు కంటూ.. ట్రైన్ ఎక్కనా కొరియా వెళ్తానంటూ మొదలైన తన ప్రయాణం ఎలా సాగిందో తెలియాలంటే 'మేడ్ ఇన్ కొరియా' చూడాల్సిందే. క్రాస్ కల్చర్ డ్రామా నేపథ్యంలో ఈ చిత్రాన్ని రా.కార్తిక తెరకెక్కించారు. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఒరిజినల్స్‌లో భాగంగా రూపొందిన ఈ సినిమా ఈ నెల 12 నుంచి ప్రసారం కానుంది. ఈ సందర్భంగా అధికారిక ట్రైలర్‌ను ఆవిష్కరించింది నెట్‌ఫ్లిక్స్. 'కొన్నిసార్లు మీరు ఊహించని వ్యక్తుల నుంచి ప్రేమని పొందుతారు.. కొరియా పట్ల నాకున్న ప్రేమ నన్ను నేను తెలుసుకునేలా చేసింది' లాంటి ఆసక్తికరమైన డైలాగులు.. కొరియాలో ఎదురైన చేదు అనుభవాల ప్రియాంక సన్నివేశాలతో ఆకట్టుకునేలా ఉందీ ట్రైలర్. ఈ సినిమాలో దక్షిణ కొరియా నటుడు పార్క్ హై జిన్ కీలకపాత్ర పోషిస్తున్నాడు. ఓ తమిళ అమ్మాయి కొరియా వెళ్లిన నేపథ్యంతో రూపొందిందీ చిత్రం.

# ఉస్తాద్ దెబ్బకు వెనక్కి తగ్గిన బ్యాండ్ మేళం

కన్నడ స్టార్ యష్ నటిస్తున్న 'టాక్సిక్' చిత్రం వాయిదా పడటంతో భారతీయ సినీ రంగంలో విడుదల తేదీల మార్పులు మొదలయ్యాయి. ముఖ్యంగా టాలీవుడ్‌లో పవన్ కళ్యాణ్ మోస్ట్ అవైటెడ్ మూవీ 'ఉస్తాద్ భగత్ సింగ్' ఆ ఖాళీ అయిన స్లాట్‌ను దక్కించుకోవడంతో ఇతర సినిమాలపై దాని ప్రభావం పడింది. దీంతో హర్ష్ రోషన్, శ్రీదేవి అపల్లా జంటగా నటిస్తున్న 'బ్యాండ్ మేళం' చిత్రం ముందుగా ప్రకటించిన దానికంటే వెనక్కి వెళ్లాల్సి వచ్చింది. వాస్తవానికి ఈ సినిమా మార్చి 13, 2026న విడుదలవుతుందని మేకర్స్ స్పష్టం చేసినప్పటికీ, పవన్ కళ్యాణ్ సినిమాతో పోటీని తప్పించుకునేందుకు విడుదల తేదీని మార్చి 26కు మార్చారు.



# ఫాంటసీ టచ్‌తో వృషకర్మ.. గ్లింప్స్ విడుదల

'తండేల్' విజయం తర్వాత కథానాయకుడు నాగచైతన్య నుంచి రానున్న సినిమా 'వృషకర్మ'. కార్తీక దండు దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో ఇది రానుంది. తాజాగా దీని గ్లింప్స్‌ను విడుదల చేశారు. చైతూ ఈ యాక్షన్ అడ్వెంచర్ థ్రిల్లర్‌లో అర్జున్ అనే నిధి అన్వేషకుడిగా కనిపించారు. ఆయనకు జోడీగా మీనాక్షి చౌదరి నటించారు. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర సినీ క్రియేషన్స్‌తో పాటు సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై నిర్మాతలు బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ మరియు సుకుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. దర్శకుడు కార్తీక వర్మ దండు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సినిమా అనౌన్స్ అయినప్పటి నుంచే 'వృషకర్మ'పై సినీప్రియుల్లో మంచి ఆసక్తి నెలకొంది. తాజాగా చిత్రబృందం విడుదల చేసిన గ్లింప్స్ ఆ ఆసక్తిని మరింత పెంచింది.



Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787